నేటి నిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 18-12-2025

### సప్త పదులు

అందము
ఆనందము

పువ్వుపువ్వున
వాలి తేనెటీగలు
సేకరించు
మకరందము

– ప్రసాద్ రావు
9493166148

సత్యం
నిత్యం

పలుకుతుంటే
భయపడి
పారిపోతుంది కదా
అసత్యం

-దోర్బల
9390411600

తొలిపొద్దు
మలిపొద్దు

అవకాశాలు
వదలొద్దు,
కలలు కనడం
ఆపొద్దు..

-ఋష్యశృంగు
9490904976

### సప్త పదులు

ఇంద్రియములు
కర్మేంద్రియములు
మనలను
మనము
నిగ్రహించుకొనుటకు
తోడ్పడ తాయి
జ్ఞానేంద్రియములు.

-విజయకుమారి
విజయవాడ

రాదు
కాదు

మనం
తలుచుకుంటే
సాధ్యం
కానిదేమి లేదు

-అమర్ నాథ్
మహబూబాబాద్

ఎత్తులు
చిత్తులు

అవసరాలకు
మాత్రమే ఉంటాయి
రాజకీయాలలో
పొత్తులు

-విత్తనాల
9985117789

# కవిత్వం సమాజాన్ని మారుస్తుంది

-డా॥ వై.రామకృష్ణారావు

హైదరాబాద్, డిసెంబర్ 17: (నేటినిజం ప్రతినిధి): కవిత్వం వలన ప్రయోజనమేముంటుంది అని ప్రశ్నించేవారు చాలామంది ఈ లోకంలో ఉన్నారు. కానీ కవిత్వం సమాజాన్ని మారుస్తుంది, వెయ్యిమందిలో ఒక్కరిలోనైనా మార్పు తీసుకురాగల శక్తివంతమైన పాత్రను కవిత్వం పోషిస్తున్నదని, ఈ ఆధునిక యుగంలో జరిగిన అనేక సంఘటనల ద్వారా తెలుస్తున్నదని సాహితీవేత్త డా॥వై.రామకృష్ణారావు ఉద్ఘాటించారు. ఈ నెల 11న గురువారం హైదరాబాద్ మోహన్‌నగర్‌లోని కొసరాజు ఆర్తి & జాహ్నవి మెమోరియల్ ఛారిటబుల్ట్రస్ట్ కొసరాజు సామ్రాజ్యం సంపాదకత్వంలో **'అంతా అవినీతిమయం - అంతం చేయాలి మనమిక'** అనే అంశంపై ప్రచురించిన **'చిగురింపులేని వర్షం'** కవితాసంకలనం ఆవిష్కరణ సభకు వారు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. సభాధ్యక్షత వహించిన నేటినిజం సంపాదకులు బైస దేవదాసు ప్రసంగిస్తూ అవినీతి అనేది అన్నిట్లో ఉన్నదని, ముఖ్యంగా ఆస్పత్రులలో జరిగే అవినీతి వలన ఎందరో రోగులు ఇబ్బంది పడుతున్నారని, ఈ కవితా సంకలనంలోని కవితలు తప్పకుండా ప్రజల్లో మార్పును తీసుకు వస్తుందని ఆశిస్తున్నానని అన్నారు. సభా ప్రారంభకులు సాహితీకిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు మాట్లాడుతూ సుదూర ప్రాంతాలనుండి కవులు బహుమతి తీసుకోవటానికి రావటం విశేషమని, వారికి కవిత్వం మీదున్న టువంటి ఆసక్తి ఎటువంటిదో అన్న విషయం దీని ద్వారా తెలుస్తున్నదని అన్నారు.

సంపాదకత్వం వహించిన కొసరాజు సామ్రాజ్యం మాట్లాడుతూ ఇప్పటి దాకా తాను వివిధ అంశాలమీద నాలుగు కవితాసంకలనాలని ప్రచురించానని, వీటిలో ఉన్నటువంటి కవితలన్నీ కూడా తనకెంతో మనశ్శాంతిని ప్రసాదించాయని తెలియజేశారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన డా॥వంశీ రామరాజు నిర్వాహకులను, బహుమతి విజేతలను అభినందించారు.

ఈ కవితలపోటీలు విజేతలైన మౌనశ్రీ మల్లిక్ (హైదరాబాద్), నల్లు రమేష్ (పోలిరెడ్డి పాళెం), సంఘమిత్ర (విశాఖపట్టణం), తాండ్ర చిరంజీవి (వరంగల్), రాధకృష్ణ కర్రి(విజయవాడ) బహుమతులు స్వీకరించగా, కవులు, కవయిత్రులు పిన్నింటి ఆండాళ్ళు, మొక్కెర బలరాం, ఆచంట అంజని, పరిమి వెంకట సత్యమూర్తి, ఆచంట సుధాకర్, కొండూరి కాశీవిశ్వేశ్వరరావు, ఎన్వీ.రఘువీర్ ప్రతాప్, గూడూరి విజయలక్ష్మి, మల్లాది విజయలక్ష్మి, గడ్డం సులోచన, అన్నపూర్ణ పేరి తదితరులు కవితా సంకలనాలను వేదికపైన అతిథుల ద్వారా స్వీకరించారు.

ఈ కార్యక్రమాన్ని కవి, రచయిత పెద్దూరి వెంకటదాసు నిర్వహించగా, కొసరాజు రాజేంద్రప్రసాద్ అతిథి సత్కారం కావించారు. రంగస్థల నటులు మల్లాది వెంకటరమణ కార్యక్రమాన్ని తమ సహకారాన్ని అందించారు.



"చిగురింపులేని వర్షం" కవితా సంకలనం ఆవిష్కరణలో మౌనశ్రీ మల్లిక్ రాజేంద్రప్రసాద్, పొత్తూరి సుబ్బారావు, వంశీ రామరాజు, బైస దేవదాసు, డా॥వై. రామకృష్ణారావు, పెద్దూరి వెంకటదాసు, డా॥పి.లలితావాణి, పొత్తూరి జయలక్ష్మి, కొసరాజు సామ్రాజ్యం.



బహుమతి గ్రహీతలు తాండ్ర చిరంజీవి, నల్లు రమేశ్, మౌనశ్రీ మల్లిక్, సంఘమిత్ర, రాధకృష్ణ కర్రి సోదరితో అతిథులు.

---

నాటి తరం వారి కథలు నేటి తరానికి
## కథల వంతెన

1962లో రాసిన కథ

# ఉషస్సు
కథ



– కూర చిదంబరం
సెల్: 8639338675

చెరువుగట్టు మీంచి రాజాలు నడిచి వెళ్తుంటే, అప్పుడప్పుడు చెరువులోనికి జజారుతూ 'బుడుంగ్'మని శబ్దం చేసే చిన్న గులకరాళ్ళు తప్ప, అంతా నిశ్శబ్దం. పశ్చిమాన అప్పుడే ఎరుపురంగు అలుముకుంది. చెరువులోని చేపలు వెండి శకలాల్లా, ఎగిరిపడుతున్నాయి. పసివాడు కూడా ఆ ప్రకృతి శోభను చూసి ఆనందించే దృశ్యం. కాని రాజాలు ఇవన్నీ పట్టించుకునే స్థితిలో లేడు. మనస్సు అన్యాక్రాంతమయింది. తేనె పెరలాగా మనసునిండా దట్టంగా ఆలోచనలు పులుముకున్నాయి.

> **"దొంగ వెధవ' నా పండంటి కాపురంలో చిచ్చు రగిల్చాడు. ఎంత మదం.. కళ్ళు నెత్తికెక్కాయి కాబోలు. నేనంటే వాడికెంత అలుసు..**

ఎదురుగా తోటి పాలేరు కనిపించినా– కళ్ళు పనిచేయడం లేదు. అతను చుట్టకు నిప్పుడిగినా వినిపించుకునే స్థితిలో లేడు.

"రాజాలూ! కాస్త నిప్పియ్యొయ్!"

ఎటో చూస్తూ నోటిలోంచి చుట్టతీసి అందించాడు రాజాలు.

"అంత మగతగా ఉన్నావేం రాజాలు?" అన్నాడు తోటి పాలేరు చుట్ట అంటించుకుంటూ.

'ఏం లేదు, మనసెటో పోతూ వున్నదంతే.. వాన వచ్చేట్లున్నదే" అన్నాడు రాజాలు మాట తప్పించాలని.

"ఔను రాజాలూ, నోట్లో దుమ్ము కొట్టేట్లుంది.. మంచెకాడికా బయల్దేరావు?"

"ఔను"

ఇద్దరూ విడిపోయారు.

"మంచెకాడికేలే.. ఆ రామిగాడి మంచె కాడికే. రామన్న పేరు తలవగానే, రాజాలు కండలుబికాయి. కళ్ళల్లో జీర స్పష్టంగా కనిపించింది.

''దొంగ వెధవ' నా పండంటి కాపురంలో చిచ్చు రగిల్చాడు. ఎంత మదం.. కళ్ళు నెత్తికెక్కాయి కాబోలు. నేనంటే వాడికెంత అలుసు.. కాకుంటే నా పెళ్ళాన్నీ..' అప్రమత్తంగా వో చెయ్యి మీసం మీదకు. మరో చెయ్యి బొడ్లో దాచుకున్న కసాయి. కత్తిమీదకు పోయింది. 'కండకావరం వెధవ. ఇవ్వాళ్లే అంతు చూస్తాను. తెల్లారేసరికి వాడి మాంసం నక్కలు పీక్కు తినకపోతే నా పేరు రాజాలే కాదు"

'చిటపట'మని చినుకులు మొదలెట్టాయి. ఎంత నడిచినా ఆంజనేయుడి తోకలా పెరుగుతూనే ఉంది చెరువుకట్ట.

చిన్న తూము దాటాడు.

చెరువులో చినుకులు పడినపుడెల్లా నాగుబాము పడగలెత్తినట్లు నీళ్ళు లేచి మళ్ళీ అణగుతున్నాయి.

"అరే. వాన జోరయ్యేట్లే వుందే. త్వరగా నడవాలి. వాణ్ణి సఫా చేసేవరకూ ఎక్కడా ఆగకూడదు'' అనుకుంటూ త్వరగా నడుస్తున్నాడు రాజాలు.

వాన ఎక్కువయింది. ఎదురుగాలి, రాళ్ళలాంటి చినుకులు. గాలికి కొట్టుకొని వచ్చే ఆకూ, అలమూ, ముఖానికి 'ఫెడీ'మని కొడుతూ ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఒక్క అడుగు కూడా ముందుకు వేయనివ్వటం లేదు.

కట్ట దిగేశాడు

కాని ఏం కనిపించటం లేదు. పూర్తిగా చీకటి అలుముకుంది. మేఘాలు దట్టంగా క్రమ్ముకున్నాయి. మెరుపులు మెరుస్తున్నాయి. ఉరుములు ఉరుముతున్నాయి.

హఠాత్తుగా వో పెద్ద మెరుపు మెరసి మాయమయింది. ఎదురుగా కనబడింది దొరగారి పాడు పాడిన బంగ్లా.

"అందులో తలదాచుకుని, తగ్గాక పంతం మాట చూడొచ్చు" అనుకున్నాడు.

అతన్నంతగా భయపెట్టినవి ఉరుములు. అష్టదిగ్గజాల చెవులు సైతం దిమ్మరలెక్కేట్లు వురుముతున్నాయి. బ్రహ్మాండం బ్రద్దలయినట్లు, జగత్ప్రళయం సంభవించబోయేట్లు, మేఘాలు వురుముతున్నాయి.

దట్టంగా పెరిగిన జిల్లేడు మొక్కలను, బూ తులసి మొక్కలను, వొత్తిగిల్లుకుంటూ లోనికి వెళ్ళాడు.

అది వసారా..

క్షణకాలం ఆకసం వేపు చూసి పరిసరాలు చూసుకున్నాడు. చుట్టూ భయం కొలిపే చీకటి దానికి తగినట్టు కాళ్ళక్రిందేవో పిచ్చిమొక్కల కదిలిక, చుట్టూ జిల్లేడు మొక్కలు. అప్పుడప్పుడు మెరుస్తుంటే కనపడుతున్న మొండిగోడలు. అర్థంకాని భాషలాగా ఏవేవో దృశ్యాల్లాగా, గోడలనిండా ఏర్పడిన మట్టి నీటి ధారల తాలూకు చారికలు. పైగా.. అన్నింటి కంటే భయం గొలిపే వురుములు.. మెరుపులు..

భగవంతుడు తన బిడ్డల మీద కోపంగా వురిమి చూస్తున్నాడేమో.. తల దులుపుకుంటూ అడ్డపంచె కొసల్ని పిండుకుంటూ నిలుచున్నాడు ఎంతో భయం వేసింది రాజాలుకు.

కాని లచ్చిమి మాటలు వినిపించాయి.

"మామా! నేనెంగిలి కూడును, కుక్కముట్టిన కుండను. గడీకి పోయినపుడు, పాలేరు రాముడు.." రెండు చేతులతో నెత్తి బాదుకుంది. రాజాలు అనంతసాగరలా పొంగిపోయాడు. పళ్ళు పటపటలాడించే సరికి, పళ్ళ మధ్య బీడి, నామరూపాలు లేకుండా అయిపోయింది. కాని ఆలోచించాడు.

'వాడింత పొగరుబోతుగిత్తలా తిరుగుతున్నాడంటే కారణం పటేలు. ఆయన అండలో వాణ్ణె దిర్చి వూళ్ళో ఉన్న వాడెవ్వడూలేడు. సమయం చూసి ఎదురుదెబ్బతీయాలి' అనుకున్నాడు.

కాని ఎంత ఆపుకున్నా ఆవేశం ఆగటం లేదు. సరాసరి కసాయి కత్తి తీసుకొని బయట పడపోయాడు. కాని లచ్చిమి వారించింది.

"వాడికున్న బలం తెలుసుగద! మామా నిన్ను జూసే నేనింక బతికున్నది" మాట పెగల్లేదు. వెక్కివెక్కి వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ నోట్లో చెంగు కుక్కుకుంది. కాని ఆగకుండా బయల్దేరాడు రాజాలు.

మధ్యలో వాన.

దైవేచ్ఛ ఎలావుందో ఎవరికి తెలుస్తుంది?

"వాన వెలిసేట్టులేదే... రామిగాడు.. హుం.. కసిదీరా ముక్కలుగా నరికెయ్యాలి. నా పెళ్ళాన్నీ.." ఆవేశంతో ఊగిపోయాడు..

"నువ్వు మాత్రం తక్కువా రాజాలు..?" యెవరో చీకటినుండి శక్తినంతా కూడ గట్టుకుని పలికినట్లనిపించింది.

మొహం మీద కొరడా దెబ్బ కొట్టినట్లయింది రాజాలుకు. చీకట్లో కనిపించిందెవరిదో ముఖం.. బాగా పోల్చుకున్నాడు అది రత్తిది.. వణికిపోయి కూలబడబోతూ ప్రక్కనున్న జిల్లేడుకొమ్మ నాసరాపట్టుకున్నాడు.

"నువ్వు..నువ్వు..." నోరు పెగలటం లేదు. కళ్ళు మూసుకున్నాడు. అది రత్తే.. ఆ ముఖం రత్తిదే.." అని గొణుక్కున్నాడు.

పదేళ్లక్రితం, తన జీవితాన్ని ఓ బావికి అర్పించిన రత్తి గుర్తుకు వచ్చింది.

'రత్తి చనిపోయిందిక్కడే కదూ? తను రత్తి ప్రాణం తీసిందీ యింటి బావిలోనే కదూ...' అంత వరకూ మూసి ఉంచి కళ్ళను తెరిచాడు.

ఎదురుగా కన్పించింది రత్తిశవం. వళ్ళంతా గీసుకుపోయింది. చీర,రవిక పీలికలై శరీరాన్ని కప్పలేకపోతున్నాయి.

"కొంపదీసి దయ్యంకాలేదు గదా?"

"ఆహ్వా..ఆహ్వా..ఆహ్వా.." ఎవరో అరిచినట్లయింది. గావుకేక పెట్టి బల్లిలా గోడను కరుచు కున్నాడు. ఒక మంటిబెడ్డ బలంగా నెత్తిమీద కూలింది.

ఎదురుగా తనిపించిందో ముఖం.. ముఖం తప్ప శరీరం అంతా మసకలో లీనమయి ఉన్నట్లనుపించింది.

"ముఖం మీద ఆ నవ్వేంటీ?... పిశాచం నవ్వు.. అబ్బ నరాలు తోడేస్తుందే.." చావుకేక పెట్టి భయంతో ప్రక్కగదిలోకి పోయాడు. రెండు చేతులతో ముఖాన్ని కప్పుకున్నాడు.

"నేను రాజాలూ.. గుర్తుపట్టలా? రత్తిని.. రామిగాడి పెళ్ళాన్ని''ముందుకు వంగి, రాజాలమీద కొరిగింది ఆ ఆకారం.

ప్రాణాలు పోయాయి రాజాలుకు. బయట పెద్దగా వాన. కళ్ళు తెరిచి చూసుకున్నాడు ఏమీ లేదు. 'అంతా భ్రమే' అనుకున్నాడు.

కాని అది నిజమే..

పదేళ్ళ క్రితం తాను జగపతి దొర వద్ద ఇదే బంగ్లాలో పనిచేస్తున్నప్పటి సంఘటనలు మనసులో మెదిలాయి.

ఇప్పుడు తనకేం నెత్తురు చావకున్నా, అప్పుడు తాను ఇరవయ్యేళ్ళనాడు, ఉడుకు నెత్తురు ఉరకలు పెడుతున్న షోకేలా మనిషి.

జగపతి దొర తననెంతో ప్రేమగా చూసేవాడు. ఆయన భార్య రామలక్ష్మమ్మ అన్నపూర్ణ తల్లే.. ఏ రాత్రి అయినా విసుగుకోకుండా అన్నం పెట్టేది. తను వారింట్లో పాలేరు. కాని జగపతి దొర తర్వాత తనే ఆ ఇంట్లో రెండో దొర.

ఓనాడు క్రొత్తగా పనిలోకి వచ్చిన రత్తి కనిపించింది. మిసిమి యౌవ్వనంలో పదహారేళ్ల పాలు గారే వయస్సు. అన్నింటికి మించి ఆ అవయవాల పొందిక, నడక, తనకు మత్తెక్కించాయి.

రత్తి తన ముందుండి వెళ్ళుతుంటే వళ్ళంతా వేడుక్కేది. తన కౌగిట్లో ఉన్నట్లే పరవశమయ్యేవాడు. కాని తన నిజస్థితి తెలియగానే గుటకలు మ్రింగి ఊరుకునేవాడు.

కామోన్మాదం కళ్ళను గప్పి, జ్ఞానాన్ని పోగొట్టుందటారు. అంతేనేమో.

ఏదో సాకుతో, పనిచేస్తున్న రత్తిని పిలిచేవాడు. రత్తి చలాకీ పిల్ల. రామన్నని మనువు చేసుకుని క్రొత్తగా కాపురానికి వచ్చింది. ఇంకా పిల్ల గుణాలు పోలేదు. చలాకీగా మాట్లాడేది. ఎగతాళి చేసేది.

"మా మామ ముందు నువ్వేంసాటి?" అంటూంటే తనకు ఉడుకుమోతుదనం పుట్టుకొచ్చేది.

జగపతి దొరకు ఇద్దరే సంతానం. అబ్బాయి పట్నంలో చదివేవాడు. బిడ్డకు పెళ్ళయి కాపురానికి పోయింది. వారిద్దరూ, ఏకాకైన తనూ, ఉండేవారా యింటిలో.

తను ప్రొద్దున్నే పొలం నుండి వచ్చి, ఆవు పాలు పిదికి, వేపపుల్ల నోట్లో వేసుకుని, పశువులమేతా అదీ చూసి, చద్దన్నం తిని, ప్రొద్దు పొడిచేలోగా, పశువులతో పొలంవేపు వెళ్ళేవాడు. ప్రొద్దు క్రుంకేవేళకు మళ్ళీ వచ్చి పాలుతీసి, తిని, మంచెకావలికి వెళ్లేవాడు.

ప్రొద్దున్నే రత్తి వచ్చి, పాచిపని చేసి ఇల్లువూడ్చి, చల్లచేసి, మెల్లగా మధ్యాహ్నం వేళకు అన్నం పట్టుకుని, రామన్నవద్దకు వెళ్ళేది. మళ్ళీ మూడు ఝాముల వేళకు వచ్చి పాత్రలు తోమి వెళ్ళిపోయేది.

రత్తిని తనోకంట కనిపెడుతూనే ఉన్నాడు. కళ్ళతో బాసలు చెప్పాడు. చీదరించుకుంది. సంజ్ఞలు చేశాడు. "ఛీ" అంది. 'కాస్తలో లొంగేఘటం కాదనుకున్నాడు. సమయం కొరకు కాచుకుకూచున్నాడు.

ఓ రోజు..

అయ్యగారికి అమ్మగారికి దుర్దినం. ఐతేనేం తనకు సుదినం.

అమ్మగారు భోంచేస్తున్నారు. తనూ దొరగారూ పొలం కలుపుకూలీ విషయం మాట్లాడు కుంటున్నారు.

ఇంతలో పోస్టుమాన్ వచ్చాడు టెలిగ్రాంతో..

చదివిన అయ్యవారి ప్రాణం పైన్నే పోయింది. "కూతురికి నొప్పులు.. చాలా ప్రమాదంగా ఉంది. త్వరగా రండ''ని వియ్యంకుడు వ్రాసాడు.

పాపం అమ్మగారు అలాగే లేచింది. తన్ను పిలిచి పనులు వప్పజెప్పింది.

క్షణాలమీద బండి కట్టాడు తను.

తనూ వస్తానన్నాడు. కాని అయ్యగారే వద్దన్నారు. ఇంటి పని, పాడిపని, పొలం పని చాలా ఉందని తన చేతిలోనుంచి ములుగర్రను తీసుకున్నారు.

బావురుమంది ఇల్లంతా..

కాని తన చెవుల్లో అమ్మగారు చివరన చెప్పిన మాటలే గింగురుమంటున్నాయి. 'మూడు గంటల వేళకు రత్తి వస్తుంది. అంటుగిన్నెలు వేసి, తోమాక ఇంటికి తాళం వేసి పొలానికి పడుకోటానికి పో." తన రొట్టె విరిగి చేతిలో పడిందనుకున్నాడు.

ఇంట్లో తానొక్కడే.. సింగారించుకున్నాడు. అబ్బాయిగారి సిల్కు లాల్చీ, అయ్యగారి వంచ కట్టుకున్నాడు. పవుడరులు అవీ వేసుకున్నాడు. అద్దంలో తనని చూసుకుని తనే మురిసిపోయాడు.

ఏదో కూనిరాగం తీస్తూ వచ్చింది రత్తి.

"అమ్మగారూ!" అని పిలిచింది..

చప్పున బొట్టుపెట్టి మూసివేశాడు. చప్పుడు విని అమ్మగారు గదిలో వుందేమోనని వచ్చింది.

ఎదురుగా రత్తి.. తన కలల పంట... ఇన్నాళ్ళు తన కందకుండా పైకెగిరిన చిలుక. ఒక వుదుటున రత్తి చెయ్యి పట్టుకున్నాడు.

వదలమంది బ్రతిమాలింది. 'రామన్నకి చెబితే నీ కండలు తీస్తా"డంది.

కాని.. తనేం చేశాడు?

ఓ వికృతపు నవ్వు నవ్వాడు. సందిట్లో గట్టిగా నలిపేస్తున్నాడు. రత్తి గింజు కుంది. కాని చివరికేమైందో.. చేష్టలుడిగిన జింకలా అయిపోయింది..

అమ్మగారి మంచంమీద పడేసాడు.

ఇన్నాళ్ళు ఎవరిగూర్చి వ్యర్థంగా గుటకలు మ్రింగాడో.. అది తన కౌగిట్లో ఉంది.

రాక్షసులకు పువ్వును చిదిమితేనేగాని తృప్తి ఉండదంటారు.

ఇన్నాళ్ళు తనకందని పండయిన రత్తిని కసిదీర నలిపివేశాడు.

ఫలితం.. రత్తి సొమ్మసిల్లిపోయింది.

తనకేం భయం.. ఇంట్లో తను తప్ప మర్వె వరూ లేరు.

ఆవేశం పాలపొంగులా చల్లారిపోయింది. చేసిన పనికి భయం పుట్టుకొచ్చింది.

గబగబ తన అలంకారాలన్నీ తీసేసుకున్నాడు.

రత్తివద్దకు వెళ్ళి చూసాడు. నిశ్చలంగా నిద్రపోతున్నది. అది నిద్రకాదు– మూర్ఛ.

తను వాంఛ తీర్చుకుంది రత్తి ఆత్మతో కాదు శీరీరంతో. వంటినిండా గాట్లు, చెంపలపై నెత్తురు పేరుకుంది. రక్తమయమయ్యాయి. రవికంతా పీలికలయిపోయింది.

తనలో పిరికితనం ప్రవేశించింది. కొంపతీసి మగనితో చెప్పుకోదుగద! తనలో ఆదుర్దా పెరిగి పోయింది. ఓ ఆలోచన తట్టింది. రత్తి ప్రమాదాన చచ్చినట్లు లోకాన్ని నమ్మిస్తే..

అంటుగిన్నెలన్నీ బయటవేసాడు. బావిలో చేదను వదిలాడు. బావిగోడ చాలా చిన్నది. చేద వేపు కొన్ని మట్టిపెళ్ళలు లోనికి తోశాడు. కూరకాడలా పడి ఉన్న రత్తిని బావిలో పడేశాడు. ఏమీ ఎరుగనట్టు పొలం వేపు వెళ్ళాడు.

మునసబుకు తనేం సాక్ష్యం చెప్పారు?

అంతా అబద్ధమే

'రత్తికి గిన్నెలు వేసి తోమి లోన ఉంచి తాళం వేసి పొమ్మన్నా'నని చెప్పాడు. చిన్న అబద్ధంతో తన మెడకు పడే ఉరిత్రాడు గురి తప్పింది.

పాపం! అదే ముహూర్తాన జరిగిందో, దొరవారింట్లో అన్నీ అశుభాలే..

అమ్మాయిగారు పురుట్లో చనిపోయారు. అబ్బాయిగారు ఆక్సిడెంటులో చనిపోయారు.

జగపతి దొరకు రామలక్ష్మమ్మకు మతి చలించినట్లయింది. ఊళ్ళో వుండబుద్ధి కాలేదు. అంతా అమ్ముకుని బంగాళాను అమ్మజూపారు. కాని కొనే నాథుడు కనిపించలేదు. ఊరి కివతల. పైగా రత్తి దయ్యమయిందన్న పుకారు.

> **రాక్షసులకు పువ్వును చిదిమితేనేగాని తృప్తి ఉండదంటారు. ఇన్నాళ్ళు తనకందని పండయిన రత్తిని కసిదీర నలిపివేశాడు. ఫలితం.. రత్తి సొమ్మసిల్లి పోయింది.**

రత్తి దయ్యమై ఇక్కడ తిరుగుతుందంటారు. పగలు కూడా ప్రవేశించడానికి జంకుతారు. నిజమే నేమో..

బయట వాన ఇంకా కురుస్తున్నట్లే వుంది.

"పగ! పగ తీరుకున్నా రాజాలూ.. పగ" తన వెంట్రుకలు రాజాలు మీద ఆడించింది భయంకరంగా వో చూపు చూస్తూ..

మళ్ళీ భయం పుట్టింది రాజాలుకు. కాని హృదయంలో సంచలనం కలిగింది.

"అవునేమో.. అప్పుడప్పుడు రత్తి అంటుడేంది"నే పగబడితే చాలు రాజాలూ చచ్చాకైనా తీర్చుకుంటాను" అనేది.

"పోవే బడాయి కానీ"అనేవాడు తను.

ఆ మాట నిజమేనేమో..

××

బయట కాకులు, 'కావు కావు' మన్న ధ్వని వినిపించింది. తలెత్తి చూసాడు. ఆకాశం నిర్మలంగా ఉంది. మొదట పట్టిన మబ్బులన్నీ మాయ మయ్యాయి. ఇంక కొన్ని క్షణాల్లో తెల్లవార బోతున్నది.

వానెపుడో వెలిసింది..

ఇంటిని దాటి బయటికి వచ్చాడు రాజాలు.తనేదో మారిపోయినట్లు, తనలో యేదో ఆవేశించినట్లు అనుపించింది.

బొడ్లో కత్తి ఎక్కడో జారిపోయింది.

బంగళా దాటి గబగబా అడుగులు వేయసాగాడు. ఎక్కడికి..

రామిగాడి వద్దకు కాదు..

"ఇంట్లో లచ్చిమి వొక్కత్తే వుంది. కొంపదీసి, యే అఘాయిత్యము చెయ్యదు గదా అనుకుంటూ వచ్చిన దారి పట్టాడు.

అప్పటికి గాని సూర్యుడు పూర్తిగా ఉదయించలేదు.

## నీ స్నేహ సంతకం

సరళ రేఖలా-సానుకూలతను చేకూర్చే-కలవృక్షం-నీ స్నేహ సంతకం
సమభావనతో-సంచరించేలా చేసే-కర్షకం-నీ స్నేహ సంతకం
సరదాగానే వుంటూ-దగా చేయ నివ్వని-అవరోధకం-నీ స్నేహ సంతకం
సడి వినగానే-చిరునవ్వుతో స్వాగతించే - ప్రముఖం-నీ స్నేహ సంతకం.

సహకారానికి-సన్నధతతో మెలిగే-మౌక్తికం-నీ స్నేహ సంతకం
సమంజసమైన-పన్లనే చేయించే-పూనకం-నీ స్నేహ సంతకం
సరే సరే నంటూనే-సాగతీత పన్లు చేయనివ్వని-నాగరికం-నీ స్నేహ సంతకం
సంస్కృతిని-జ్యోతిలా-అలరించేలా చేసే-గమకం-నీ స్నేహ సంతకం.

సమయ పాలనను పాటించేలా చేసే-గంధకం నీ స్నేహ సంతకం
సమాజం మెచ్చుకునేలా చేసే-కారకం-నీ స్నేహ సంతకం
సభ్యతగానే వుంటూ-మభ్యపెట్టే పన్లు చేయ నివ్వని-కీలకం-నీ స్నేహ సంతకం
సగటు జీవిని కూడా-ఇష్టతతో లాలించే-లోలకం నీ స్నేహ సంతకం.

సమాచారం-ఎఱిగి-ఎదిగేలా చేసే-ఏరువాకం-నీ స్నేహ సంతకం
సఖ్యతతో-సమిష్టిగా అడుగిడేలా చేసే-ప్రయుక్తం-నీ స్నేహ సంతకం
సముఖమున-సుముఖంగానే వుంటూ-నష్టం చేకూర్చ నివ్వని-ప్రత్యేకం
నీ స్నేహ సంతకం
సమస్యలను-స్పష్టతతో-అనుకూల పరచేలా చేలా
శ్రద్ధ-ధ్యాస-శ్వాసలను నిలిపి-ప్రతి కదలికలోనూ-శ్రమిస్తూ-
నిన్నలేని అందాన్ని అందుకునేలా-నారాయణీయ
గంగా ప్రవాహ-పారవశ్య-స్నేహ రేఖలను అందించే -
ప్రమోద రూపకం - నీ స్నేహ సంతకం.



**-లంకా వెంకట సుబ్రహ్మణ్యం**
9440448650.

## వృద్ధుడను వ్యర్థుడను

వ్రాలిపోయే వృక్షమును-రాలిపోయే పుష్పమును,
ఎండిపోయే కొమ్మను-ఊడిపడే ఆకును,
ఆరిపోయే దీపమును-ఆగిపోయే గుండెను,
వీడుబోయిన పొలమును-తగలబెట్టిన పంటను.

ఆకర్షణలేని రూపమును-ఆకట్టుకోలేని అక్షరమును,
పుచ్చిపోయిన విత్తనమును-చెడిపోయిన ఫలమును,
పదునులేని ఖడ్గమును-సిరాలేని కలమును,
వయసుమీరిన వృద్ధుడను-శక్తిలేని అసమర్థుడను.

అస్తమిస్తున్న సూరీడును-కదలలేకున్న కలమును,
రాహుమ్రింగుతున్న చంద్రుడను-కూలుతున్న తారను,
జుట్టులేని శిరమును-ఊహలుడిగిన మనసును,
చూపుమందగించిన అంధుడను-వినికిడితగ్గిన బధిరుడను.

కరిగిపోయే కాలమును-ఎగిరిపోయే దూదిపింజను,
కాల్చబోయే కాయమును-గోడకేలాడబోయే చిత్రమును,
రాయాలనుకున్నా కవితలుకూర్చలేనివాడను,
సాహితీసేవను సాగించలేనివాడన.

డబ్బులు లేనివాడను-జబ్బులు ఉన్నవాడను,
ఇంటికి బరువును-భూమికి భారమును,
ఏమయినా అక్షరాల్లో-ఇంకా మండుతుంటా
మదుల్లో మెదులుతుంటా-జనాల్లో జీవిస్తుంటా



**-గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్**
సెల్: 7981616630

## సర్వరోగ నివారిణి!

చాలా మంది అధికారులు
రాజకీయ నాయకులు తమ
వ్యక్తిగత అంతరంగికులను
బంధుమిత్రగణ బృందాలను
చుట్టున్న అనుయాయులను
ఎవరెంత చెప్పినా వినకుండా
వారు చెప్పిందే వేదవాక్కన్నట్లు
నమ్మి, అందర్ని నట్టేటముంచి
చివరికి వాళ్ళేమునిగిపోతారు!

ఎన్ని తెలిసినా గానీ 100కు 100
మార్కులు ఆ మూర్ఖులకే ఇచ్చి
మనోభావాలతో ఆడుకుంటారు.
ప్రతీ ఉద్యోగి పదవి విరమణదాక
విరమణలేని అనూహ్యానుభవాల
హృదయవిధారక వేదనల ఘోష
జగతిలో సర్వవ్యాప్తమైన రోగమిది
స్థాన చలనమే
సర్వరోగ నివారిణి!



**- డా. డి. రాజేశ్**
9440460490

## పుస్తక నేస్తం

కొత్త పుస్తకం చూడగానే
తెరచి చూడాలనిపిస్తుంది.
అక్షరాలు నవ్వుకుంటూ రివ్వున ఎగిరి
నా మనో హృదయం పై రెక్కలు విప్పుతాయి.
వాటిని అచేతనంగా పట్టుకొని
అనువనవు ఆస్వాదించాను.
కొన్ని పదాలు ఇంద్రధనస్సులా
సప్తవరణాలు విరబూసాయి.
మరి కొన్ని వాక్యాలు చదివాను.
నిశ్శబ్దంగా రోదిస్తూ అంతులేని ఆవేదనతో
విషాద గీతాలను ఆలపించాయి.
మరొక పేజీ తిరగేశాను.
అంతర్మథనంతో ఆత్మవిశ్వాసాన్ని నిలదీసి
ఔన్నత్యాన్ని ఎత్తి చూపించాయి.
ఇంకొక వరుసలో విలువలు కోల్పోయి
అహంకారపు పొరల్లో దాగిన విద్వేషాన్ని
చీదరించుకొని మానవీయతను ప్రశ్నించాయి.
పేజీలు తిరగబడుతున్నాయి.
రాతలన్నీ జ్ఞాన దీపాలై
జీవన సౌందర్యంతో పీఠం వేసుకుని
నిశ్శబ్ద చీకటిలో సైతం కాంతులు వెదజల్లుతున్నాయి.
విశ్వ చేతనకు అక్షరాలు పూలమాలలల్లి
చిరకాలం సుగందాలను ఆస్వాదించమన్నాయి.
మాసిపోనివి, మలినం కానివి,
కల్మషం లేని అక్షరాలు మాత్రం
రేపటి స్వప్నాలకు కలల సహకారం చేస్తూ
ఒంటరితనాలకు, దిగులు గుగుళ్ళకు
ప్రేమను పంచే నేస్తలం మేమే అంటూ
పుస్తకాలయాలని కాంతిపుంజలై
నిత్య సోబితాలుగా హస్తభూషణాలై
మస్తిష్కానికి మంచి గందాలు
మన పుస్తక నేస్తాలు.



**-తాటి కోల పద్మావతి**
9441753376

## ఆదా.. ఎలా

ఆదాయమే అంతంత
ఇక "ఆదా "చేయడం ఎలా
దుబారా అదుపుతో పొదుపు
జీవితానికి మధుపు సూక్తే
ఏ రోజుకారోజు శ్రమ అమ్ముకొని
జీవించే సగటు బతుకులకు ఎలా
గంపెడంత సాగర సమస్యలు
ఎంత వచ్చినా జల్లడలో నిలవని
నీటి బొట్టు పరిస్థితి శ్రమజీవిది



**-పత్తి శివప్రసాద్**
9440001224

## వందేమాతరం

భారత స్ఫూర్తిమంత్రం
స్వరాజ్య గరళ ఆయుధం
దేశభక్తి ఊట బాయి స్వరం
పౌరుష వరదలు పారించిన గీతం
నాటి ఆయుధం నేటి ఔషధం
సుజలాలతో సుఫల సేద్యం
శీతల పవనాల స్వచ్ఛ భారతం
నవ్వులతో సుమధుర భాషనం !.
వికలమనస్కుల్లో వీరత్వాన్ని తట్టిలేపి?
నిద్రాణ సమాజాన్ని చైతన్య పరిచి..
నిర్లిప్త మనిషిని నిటారుగా నిలిపి..
మూలుగుల్లోంచి అగ్నిని రగిలించి..
పిరికోడి రుధిరంలో ధైర్యాన్ని నూరిపోసి..
ఐక్య భరత జాతిని జాగృత పరిచి..
ఉద్యమ స్ఫూర్తికి ఊపిరి పోసి..
స్వాతంత్ర్యాన్ని చేతుల్లో పెట్టింది..
నాటి వందేమాత జాతీయ గీతం !.
వందేమాతర గీతం స్వరం మారొద్దు
అవినీతి కంపు మదిలో పారొద్దు
మృగాళ్ల ముళ్ల చూపులు తెరవొద్దు
భరతమాత మనసును బాధ పెట్టొద్దు
సామాన్యున్ని స్వార్థం ముంచేయవద్దు
సైబర్ మోసగాళ్లు రెచ్చిపోవద్దు
మానవ తప్పిద విపత్తులు జరగొద్దు
నైతికత చెరువుకు గండి పెట్టొద్దు
మానవీయతకు మంట పెట్టొద్దు !



**-మధుపాళీ**
9949700037

## ఇంతకీ నీవే బొమ్మవి?

ఏమో!
నీవు ఏ బొమ్మవో ఏమో!
అంతు చిక్కని ప్రశ్నే
కానీ
సరిగ్గా వెతికితే సమాధానమే నీలో
నీలోపలే ఉందే మనసు చెప్పే
చిన్నపాటి ఆనందాలను నెరవేర్చుకునే
మనసు బొమ్మవా?
సమాజం అనే ఎత్తిపొడుపులో
మాటలు విని
నిన్ను నువ్వు
సమాజానికనుగుణంగా మార్చుకోని
సమాజంచే ఆడిస్తున్న తెర బొమ్మవా?
జీవితంలో చిన్న కష్టం వస్తే
నీ గుప్పెడు గుండె మోయలేక
ఆత్మహత్యకు పాల్పడే
పిరికి బొమ్మవా ?
మత్తు మాయలో పడి
నీకే తెలియకుండా
నిన్ను మత్తు ఆడుస్తున్న
మాయ బొమ్మవా ?
ఆనందంగా ఉన్న నీ జీవితంలోకి
ఏ దిక్కులని వ్యాధి దూరీ
ఏ క్షణం ఊపిరి విడుస్తావోనని
గ్యారంటీ లేని గాజు బొమ్మవా?
ఆ దైవం చేత చేయబడి
ఆ దేవుడాడిస్తున్న మట్టి బొమ్మవా?
ఇంతకీ నీవే బొమ్మవి ?

**- కె. అక్షయ**
10వ తరగతి
జి.ప.ఉ పా రంగంపేట

## ఆత్మ సౌందర్యం మిన్న

ఎన్ని రకాల పువ్వులో
మల్లెలు, మందారాలు,
సన్నజాజి, సంపెంగలు,
గులాబీలు , ఇవన్నీ పరిమళ భరితాలు,
మరికొన్ని చూడటానికి అందంగా ఉంటాయి
కాగితపు పూలు, గరికపూలు ఉమ్మెత్త పూలు,
పువ్వులన్నీ సౌందర్యాన్ని బట్టి
పరిమళాన్ని బట్టి ఒక విశిష్ట స్థానాన్ని
పొందాయి. ఆహ్లాదాన్ని కలిగించేవి కొన్ని
అయితే వాసనలేని పువ్వులూ వున్నాయి.
మీరు మొగలి పువ్వులను చూసే వుంటారు.
మొగలి పువ్వులు కూడా పువ్వులే
వాటి సువాసన. వాటిదే.
మనుష్యులకే కాదు విష సర్పాలకు
కూడా మత్తెక్కిచ్చేవి .
అయితే మనుష్యులలో కూడా అందరూ
మందారాలు, మల్లెల వంటి వారు కాదు,
మల్లెల లాగా నిర్మలంగా వుండరు.
లోపల ఒకటి, బయట ఒకటి
మనస్సులో అంతా మాలిన్యము
అయితే మరికొందరు బయటికి
కర్కశంగా కనిపించినా వెన్నలాంటి
మనసున్న వారు. వారి ఆత్మ సౌందర్యం
మిన్న. బాహ్య సౌందర్యం కన్నా
ఆత్మ సౌందర్యం మిన్న
అని గ్రహించాలి.



**- డా॥ పులివర్తి కృష్ణమూర్తి**
సెల్:9949092761

## పుస్తకాల నిలయం గ్రంథాలయం

జ్ఞాన బండాగారం గ్రంథాలయం
పుస్తకాల నిలయం విజ్ఞాన సంపద
మనిషి వికాసానికి మూల స్తంభాలు
సమాచార కేంద్రం గ్రంథాలయం!!.
బంగారు భవిష్యత్తుకు బాటలు
బాలల వినోదాల గ్రంథాలయం
తరతరాల విజ్ఞాన సంపద
మనిషిని మనీషిగా మార్చేది!!.
సరస్వతి నిలయం గ్రంథాలయం
భవితకు బాట గ్రంథాలయం
అక్షరాల ఆలయ మది
పుస్తకాల పరిచయం అది!!.
విలువలెన్నో నేర్పుతది
విజ్ఞానులను చేస్తది
పాఠకులకు జ్ఞాన సంపద
సమాజ వికాసానికి మూల స్తంభాలు!!



**-దేవులపల్లి రమేశ్**
9963701294

## కదా!

భక్తి భావనలో తేలియాడుతూ.. దైవదర్శనం కోసం
తపించడం తప్పేమీ కాదు గానీ.. దానికోసం
పక్కనోళ్ళను పడదోస్తూ.. రాకెట్లా
దూసుకెళ్లడం నిర్ద్వంద్వంగా అమానుషం కదా!/
పండుగ నాడు సొంతూరు చేరి ఆత్మీయులతో
ఆనందించాలనుకోవడం అత్యాశేమీ కాకున్నా.. దానికోసం
టికెట్ల సిగపట్లలో.. సీట్ల సర్దుబాట్లలో
తోటివారిని స్పృహ తప్పేలా తొక్కడం మితి మీరిన స్వార్థం కదా!
సామూహిక స్నాన ఘట్టాల్లో పూజల్లో లక్షలాది తో మమేకమై
పుణ్యమార్జించాలనుకోవడం అసంగతమేమీ కాకున్నా.. దానికోసం
గుంపులతో కలబడుతూ.. కనీసం కొందరినైనా
పరలోకం పంపడం కచ్చితంగా క్రూరత్వమే కదా!
శాంతం ఓరిమి క్షమ నిదానాలను.. గాలి కొదిలేసి
నీ సుఖ సౌకర్యాల కోసం
రక్కసి పిక్క బలాన్ని లెక్కలేకుండా వాడడం
నిస్సందేహంగా కరుడుగట్టిన నిర్దయే కదా!
సంయమనం సహకారాలను మరిచి వ్యవహరించడం
ధర్మం కానే కాదని ఎరిగీ మూర్ఖుడవడం ఘోరం కదా!
దయకి చోటు లేని తావుకి.. దైవం దయచేయడని తెలిసీ..
మారకపోవడం నేరమే కదా!



**- ఎస్. కాశింబి**
9052216044

## జస్ట్ ఓన్లీ వన్ మినిట్

బోర్ల పడుకుని రెప్పల తలంపులు తెర్చుకుని
ఉబ్బెక్కిన కంటి గుడ్ల తడి స్పర్శతో
భూమిని రమిస్తున్నప్పుడు..
కొన్ని ఏళ్ళ క్రితం చంపబడ్డ ఒక పక్షి ఈక దొరికింది.
స్నేహితుడా.. ఒక నిమిషం రా.. వస్తున్నా!
నిరాశ.. నిట్టూర్పు.. కాస్తా మధ్య తరగతి ఊగిన.. వద్దు
కన్నీరు వస్తేరానీ.. లోపల గాయాల గని ఉండవచ్చు
అంతమాత్రాన.. త్రాడు తలకి సిద్ధం చేసుకోవద్దు చావాలని.
త్రాడు మనిషి తెలివికి ఒక నిదర్శనం
త్రాడు రెండు దూరాల కలయికకు ఒక వారధి
మనిషి నేస్త్రం చేసుకున్న ఒకానొక పనిముట్టు కూడా
దాహం తీర్చే జల హస్తం త్రాడు
వద్దు.... జస్ట్ వన్ మినిట్ ఐమీట్ ఫర్‌యూ.
నాకు దొరికిన పక్షిఈక.. ఒక రహస్యం చెప్పింది
ఒక బొమ్మ గీసి ఆయుధంగా బహుకరణ చేసింది
నిన్ను కలవాలని ఇంత ఒక మహ స్వప్న సాధనతో
వస్తున్నా...!
అంతవరకు స్నేహితుడా..! నీలో తన్నుక వస్తున్న
కన్నీరుతో మట్టిని కాస్తా పిసికి ముద్ద చేసి వాసన చూడు
చావు చచ్చిన నీదరి దాపులకు రాదు.
వంటి మీద వస్త్రాలు తొలగించుకుని తొంగిచూడు
బాల్యం ఉయ్యాల అమ్మ పాడిన జంపాల పాట
నీ ఎత్తు హిమ శిఖరం చూపిస్తుంది.
మరణం నీ ఛాయలకు కూడా రానేరాదు.. వచ్చినా
అబ్బో అది అదిరి చావ వలసిందే..
వద్దు.. ఇంతలో ఏ అఘాయిత్యం అంచులోకి..సంధ్య
పొద్దు ఆ చేతన పొదలలోకి పోవద్దు
నేను వస్తున్నా... పక్షి ఈకతో.. రహస్యం తెలుసుకుని.
రెండు దేశాల మీద పరుచుకుంటున్న అసమాన కౌగిలి
విష మొబ్బుల అనగనగా ఒక రహస్య కథ
నీతో చెప్తుతాను..రేపటి వికృత స్వరూపాన్ని
కళ్ళకు కట్టినట్టు.. ఒక బొమ్మ బహుమతిగా తెచ్చుకున్నాను
కదా.. నీకు చూపిస్తాను బొమ్మ దర్పిణితో..
స్నేహితుడా..! ఇంకా చావాలని నిర్ణయ ధృఢ సంకల్పంతో
ఉన్నావా! అంటే..
చంపబడ్డ పక్షి హంతకుణ్ని ఆచూకి తెలుసుకుని
చావు.. చాతనైతే ఏళ్ల తరబడి తప్పించుకుని
తిరుగుతున్న హంతకుణ్ని జాడ కనిపెట్టి వాణ్ని వైట్‌హౌసు
హంతక కుట్రల సామ్రాజ్యాన్ని ఛేదించి చావు
మై ఫ్రెండ్ జస్ట్ వన్ మినిట్ ఐమీట్ ఫర్‌యూ.
నీకు కనిపించని లోపలి చీకటి.. పిరికితనం
ఎవరో నాటిక మొక్కను.. అంతా తొలగించి, త్రెంచి
చూపిస్తాను..
ఓరేయి ఒకే ఒక నిమిషం రా ఆగరా
ఈ నేల మీద శ్వాసతో.. అమరత్వానికి అంకిత నివాళిగా..
గడి పోచమీద పిచ్చుక వాలిన రెక్కల
నిశ్శబ్ద శబ్దంతో..
జస్ట్ వన్ మినిట్.



**-జనజ్వాల**
సెల్:9949163770

## నానీలు

బంగాళ ఖాతం
వాయుగుండం
రైతుల ఎదలో
సుడి గుండం..

పేద రైతు
ప్రత్తి విత్తు
విత్తు చిత్తయితే
రైతు బతుకు విపత్తు!



**-ఎం.ఏ.గఫార్**
సెల్:9490324834

## నీతో నీవే

నీ పోరాటం
ఎప్పుడూ ఒంటరిగానే సాగాలి.
నిన్ను ఎగతాళి చేసేవాళ్లు ఉంటారు,
నీ కన్నీళ్లు చూసి
హేళన చేసేవాళ్లు ఉంటారు,
నువ్వు పడిపోయిన చోట
నవ్వే వాళ్లు ఉంటారు.
కానీ నీవు నడిచే దారిలో
నీ అడుగుల ధ్వని తప్ప
మరొకటి వినిపించ కూడదు.
గమ్యం ఎంత దూరమైనా,
ముళ్లు గుచ్చినా, గాయాలు రక్తమోడినా,
వేదన ఎంత తీవ్రమైనా,
మల్లెల సువాసనను మర్చిపోయి
గులాబీల ఆకర్షణలు లెక్కచేయకుండా
నీలో నీవే మమేకమై
ముందుకు సాగిపో.
నీ వెంట నడిచే వారు ఎవరూ లేరు,
నీ నీడ ఉన్నప్పుడు నీ జాడ వెతుకుతారు,
కానీ నీ వెలుగు ఆరిపోయినప్పుడు
నీ తలుపు తట్టే ఒక్కరూ ఉండరు.
డబ్బు లేని రోజుల్లో,
పదవి కోల్పోయిన క్షణంలో
"అభిమానులు" అనుకునే ముఖాలు
నీ గడపవద్ద కనబడవు.
గుండెలు గుద్దుకుంటూ నీకోసం అరిచిన వారే
వారే నీ పతనానికి ప్రణాళిక రచిస్తారు,
నది వరదల్లో ఎదురెక్కిన చేపలు
ఎప్పటికీ నదితో కలిసి సముద్రంలో కలవలేవు
అలాగే
నీ పోరాటంలో తోడయ్యే వారిని చూడకుండా
సాగిపో
నీతో నీవు, నీలో నీవు
ఒంటరిగా, గర్వంగా, అజేయంగా

**-పోలీస్ భీమేశ్**
9505255218

## ముసలవ్వ

బుర బుర పండిన పండు
పిల్లకాయల కోసం పరితపిస్తున్నది
ఎండిన ఆకు
వెన్నుపూస వంగి పోయి
బొక్కలు చీకిపోయి
నరాలు తేలినా
కన్న బిడ్డల కడుపు విచారిస్తున్నది.
వయసు భారమై
కడుపుల పేగులు కాటికైనా
నొప్పుల రాగాలు పలికినా
బిడ్డల మీదే పానమంతా .
ఆకాశమంత ప్రేమను
కోడిగుడ్డంత అన్నంగా కలిపి
గోరు ముద్దలు పెట్టిన అవ్వ
గోటితో విసిరే
నాలుగు గింజల కోసం
ఎదురుచూస్తున్నది.
అవ్వంటే....
ఇంటి పెద్ద దర్వాజా
కూరాటి కుండ
పెద తాంబాలం
అవ్వను మరిస్తే
ఇల్లు మబ్బుమబ్బే..



**-బొల్లం బాలకృష్ణ**
9989735216

## ఊహలు

ఊహలు
ఊరిస్తూనే ఉంటాయి.

గాలిపటం అనుకుంటుంది
నియంత్రణ లేకపోతే.

ఇంకా పైపైకి, ఎంతో ఎత్తుకి
ఎగిరిపోయి వుందును-

కనులు అనుకుంటాయి
చెవులమై వుంటే
ఎంత మంచి సంగీతం
ఆస్వాదించే వాళ్లమో!

చెవులు భావిస్తాయి
కనులమైవుంటే
ఎన్నెన్ని రమణీయ దృశ్యాలు
వీక్షించి ఉండేవాళ్లమో!



**-మాధవీ సనారా**
8639491246

## కణిక



అడ్మిన్: **రమాదేవి కులకర్ణి**
8985613123

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

**'బుధవారం బాద్షా'**

**పోటీ ఫలితాలు**

నిర్వహణ: **శ్రీమతి సత్య నీలిమ**



### ఓటమి పాఠాలు

పడిలేచే కెరటం
అనుక్షణం పోరాటం చేస్తూ
తీరం చేరాలనే చేసే ఆరాటం..
వెల్లువొచ్చి గూడు చెదిరినా
గుండె ధైర్యం నింపుకునే గువ్వపిట్ట
గూడు కట్టే ప్రయత్నం..
అపజయానికి లొంగని ఓర్పుతో
సమకూర్చుకున్న జీవితం..
శూన్యం నుండి
మాన్యం నిర్మించమని
నేర్పే ఓటమి పాఠం..!.
శిశిరమొచ్చి తరువు శరీరాన్ని
మోడుగా మార్చినా
పరిస్థితిని ఎదుర్కొని
పట్టువదలని విక్రమార్కునిలా
పచ్చని చిగురులే వేస్తుంది
వసంతాన్నే పంచుతుంది..
ఓటమికెపుడూ తలదించుకునే
పనేలేదనే సత్యాన్ని..
నొక్కివక్కాణిస్తుంది..!!.
పడిలేచే కెరటం
ఓటమిలోనే..గెలుపుందనే
నిత్యసత్యాన్ని చెప్పకనే చెబుతూ
గురుత్వాకర్షణ సిద్ధంతమే
గురువై ప్రకృతిని నడిపిస్తుందన్న
నిజాన్ని నిర్భయంగా
నిరూపించి చూపుతుంది..!!.
చూసే కళ్ళకు మనసుండాలి
నేర్చుకునేందుకు ఓర్పుండాలి
ఆచరించే ఆర్తి ఉండాలి..
అప్పుడే..ఓటమి నేర్పే పాఠాలతో
విజయాన్ని చేకూర్చుకోగలం
అపజయాన్ని హత్తుకోగలం
పదిమందికీ ఆసరా ఇవ్వగలం..!!

**-సావిత్రి రంజోల్కర్**
నవీముంబై

### అపజయాన్ని హత్తుకుందాం

ఓటమి గెలుపు ద్వారం తెరచి
విజయబాటలో నడిపిస్తుంటే
అనుభవం అడుగులకు
ఊపిరి పోస్తున్నది.
తీరం చేరాలని
తపించే తరంగాలు
పడిలేస్తు ,లేచి పడుతు
ఎగదన్నే ఉప్పెన తోస్తుంటే
ఆశ ఆనందాన్ని తోడు నడిపిస్తున్నది.
ప్రచండ భానుడిని జయించలేక
ఎండిపోయిన వృక్షం
అదొక ,బెదరక రేపటి వసంతాన్ని
తలచుకుంటు నిటారుగా నిలిచి
చిగురాకుల చిరునవ్వుతో
ఓటమి రేపటి విజయమని చాటుతున్నది.
వణికించే చలి పులిగా మారి
జనంపై విరుచుకుపడుతుంటే
కాలం నేర్పిన జ్ఞానం
భవిష్యత్తు బంగారులోకమని
సహనం,ఓర్పు,ఆలోచనలే
ఓటమిని స్వీకరించి
విజయబాటలో నడిపిస్తున్నది.

**-డా.బి.సుధాకర్**

### తప్పులను సరిచేసుకుందాం

గెలుపు ఓటమి
వ్యతిరేక పదాలు
గెలుపు మనకు సంతోషం
ఓటమెందుకో విచారం
అన్నీ అనుకున్నట్లు జరిగితే
జీవితం రుచిపచి లేనిదవుతుంది
వడ్డించిన విస్తరి కంటే
వడ్డించుకున్న విస్తరి లోని భోజనం తృప్తిగా ఉంటుంది
ఆకలితో ఉన్న వాడికి అన్నం రుచి తెలుస్తుంది
కష్టపడే వాడికి సుఖం విలువ తెలుస్తుంది
ఓడిన వాడికి గెలుపు
పిలుపు వినిపిస్తుంది
ముందుగా ఆరేళ్ళవాడయినా
అరవై యేండ్ల వాడయినా
అపజయాలను హత్తుకో వలసిందే
ఆ తరువాతనే ఏదయినా
దిద్దుకోవలసిందే ఆ పైన సరిదిద్దుకోవలసిందే

**-ఆలేటి పరంజ్యోతి** , ఖమ్మం

### కొత్త పాఠం

గెలుపంటే అందరికి ఇష్టమే
ప్రతి ఒక్కరు ఆరాటపడేది
గెలుపు కోసమే
సత్యాన్ని శోధించాలన్నా
నిత్య జీవితంలో ఎదగాలన్నా
గెలుపు పిలుపు ఆహ్వానంకై
పోరాడాల్సిన దానితో పోరాటం చేస్తూనే ఉన్నారు
నేనైతే నిత్యం ఓటమి పాలౌతూనే
కొత్త పాఠాలను నేర్చుకొంటున్నాను
మనసుకు తగిలిన గాయాలను ఓర్చుకొంటూనే
తడిలేని కళ్ళతో పడిలేచిన కెరటంలా
ప్రయత్నం చేస్తూనే ఉన్నాను
గెలుపును పోరాటంగా
ఓటమిని పాఠంగా
నన్ను నేను మలచుకొని
విజయాన్ని తలచుకొని
రేపటి గెలుపు నాదేనంటూ
ఓటమితో దోస్తీ చేస్తున్నాను
ఎన్ని ఓటమి పాఠాలు
నన్ను ఇంతటి ప్రణాళికబద్ధ ప్రయత్నానికి
బాట వేసింది
అనుభవంతో వచ్చిన ఆలోచన
నన్ను నూతనత్వానికి ఆహ్వానించింది
రేపటి విజయం నాదేనని సంకేతాన్నిస్తుంది
ఇప్పుడది సందేశమౌతుంది
రందిపడే మనుషులకు
సంది కుదుర్చుతుంది

**-కళాశ్రీ సౌరం ప్రవీణ్ కుమార్**
హనుమకొండ జిల్లా

# ప్రతి పదార్థాల పదాల సౌందర్యం ఈ ఒక్క పదం -అర్థాలెన్నో

తెలుగు భాషను మరింత ఇనుమడిస్తూ, మరింత సుందరమైన అర్థాలను, అంతరార్థాలను సామాన్యులకు సైతం అర్థమయ్యేలా రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి రచించిన "ఒక్క పదం అర్థాలెన్నో" అనే గ్రంథం తెలుగు భాషా సౌందర్యాన్ని, పదాల విశాలతను ప్రతిబింబించే ఒక విలువైన గ్రంథం. ఈ గ్రంథంలో రచయిత్రి ఒకే పదానికి సందర్భానుసారంగా అనేక అర్థాలు ఎలా ఏర్పడతాయో వివరించారు. మనం సాధారణంగా వాడే పదాలకు లోతైన భావం, వాడుకలోని వైవిధ్యం, సాహిత్యంలో అవి పొందే రుచులు అన్నీ ఈ గ్రంథంలో ప్రదర్శింపబడ్డాయి.

భాషా శాస్త్ర దృష్టిలో చూసినప్పుడు, ఒకే పదం వేర్వేరు సందర్భాల్లో వేర్వేరు భావాలు పొందడం అనేది తెలుగులో సహజమైన లక్షణం. ఈ పుస్తకంలో ఆ వైవిధ్యాన్ని స్పష్టంగా చూపిస్తూ, ఉదాహరణలతో వివరణ ఇచ్చారు. ఉదాహరణకు "మంచి", "చెడు", "చేతి", "మనం" వంటి సాధారణ పదాలకే ఎన్నో భావాలు, సందర్భాలు ఎలా ఉన్నాయో చూపించారు.

మల్లీశ్వరి గారి రచనలో భాషా పట్ల గాఢమైన ప్రేమ, పరిశోధనాత్మక దృష్టి కనిపిస్తుంది. పాఠకుడు ఒక పదం వెనుక దాగి ఉన్న అర్థ గర్భితత్వాన్ని గుర్తించగలడని, భాషను కొత్త కోణంలో చూడగలడని ఈ కృతి సూచిస్తుంది. పుస్తకం చదువుతున్నప్పుడు తెలుగు భాష ఎంత బహుముఖమైందో, పదాల రూపంలో ఎంత సౌందర్యం దాగి ఉందో మనకు తెలుస్తుంది.

ఈ గ్రంథం భాషాభిమానులు, విద్యార్థులు, సాహిత్యప్రియులు అందరికీ ఉపయోగకరంగా ఉంటుంది. ప్రత్యేకంగా పదాల పరిమళం, నానార్థాలు, పదసంబంధాలపై ఆసక్తి ఉన్నవారికి ఇది ఒక దిశానిర్దేశకంగా ఉంటుంది. మొత్తానికి "ఒక్క పదం అర్థాలెన్నో" అనేది తెలుగు భాషలో పదప్రయోగాల సౌందర్యాన్ని సులభంగా, లోతుగా పరిచయం చేసే ఒక మనోహరమైన గ్రంథంగా తెలుగు సాహిత్యం అంగీకరించాలి. ఉదాహరణకు కొన్ని పదాలను మనం గమనిద్దాం.. ఈ గ్రంథంలో 166 పదాలను ప్రస్తావించారు. మచ్చుకు కొన్ని..

అంటు, అవి, ఒట్టు, కావు, గచ్చు, ఘనము, గోవు, గోత్రము, గోవిందుడు, గాలి, గగనము, ఆట, పరిధి, పాళీ, పావనము వంటివి అనేకం ఇందులో చోటుచేసుకున్నాయి. రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి గారి "ఒక్క పదం అర్థాలెన్నో" గ్రంథంలో ఉదాహరణలుగా లేదా వివరణాత్మకంగా ఉపయోగించబడినవిగా తెలుస్తున్నాయి. ఈ గ్రంథం లక్ష్యం ఒక్కో పదానికి ఉండే నానార్థాలు (అనేక అర్థాలు)ను చూపడం కావడంతో, ప్రతి పదానికి వివిధ సందర్భాల్లో వాడే అర్థాలను ఆమె ఈ గ్రంథంలో సోదాహరణంగా మనం గమనించవచ్చు. ఈ పదాలకు సాధారణంగా తెలుగు భాషలో ఉండే బహు లేదా బహుళ అర్థాలు (ప్రముఖ ప్రయోగాలు) ఇలా ఉన్నాయి.

అంటు అనే పదం తెలుగు భాషలో అనేక రకాలుగా ఉపయోగిస్తారు. ఒక సందర్భంలో అది వ్యాధి అంటుకోవడాన్ని సూచిస్తుంది ఉదాహరణకు "అంటు వ్యాధి", "అంటు పడ్డాడు" అని అంటారు. మరొక సందర్భంలో ప్రేమతో, మమకారంతో కలిసిపోవడాన్ని కూడా సూచిస్తుంది "అతనికి నాకు అంటు ఎక్కువ" అని చెప్పినప్పుడు అది అనురాగ సంబంధాన్ని తెలియజేస్తుంది. మరో అర్థంలో అది తాకడం లేదా అతుక్కోవడాన్ని కూడా సూచిస్తుంది "రంగు గోడకు అంటలేదు" అనే వాక్యంలోలా.





**ప్రతులకు:** సాశ్రీ, 501 సీతా రెసిడెన్సీ, బ్రాహ్మణవాడి బేగంపేట్, హైదరాబాద్-16 సెల్:98665 83907

అవి అనే పదం సాధారణంగా బహువచన సర్వనామంగా వాడబడుతుంది. "అవి నా పుస్తకాలు" అనే అర్థంలో. కానీ అదే పదం వ్యతిరేకతను లేదా నిరాకరణను సూచించే సందర్భంలో కూడా వస్తుంది "అవి కావు" అంటే "అవి సరైనవి కావు". ఒట్టు అనే పదానికి అర్థాలెన్నో ఉన్నాయి. "ఒట్టు పెట్టడం" అంటే సంతకం చేయడం లేదా అంగీకరించడం. "ఒట్టు మీద నిలబడటం" అంటే వాగ్దానం చేయడం లేదా ప్రతిజ్ఞ చేయడం. మరికొన్ని సందర్భాల్లో "ఒట్టు" అబద్ధం లేదా నాటకం అనే అర్థాన్ని కూడా ఇస్తుంది "ఒట్టు చెప్పాడు" అని చెప్పినప్పుడు అది అబద్ధం చెప్పాడని సూచిస్తుంది.

కావు అనే పదం కూడా అర్థపరంగా మారుతూ ఉంటుంది. "ఇది కావు" అని అన్నప్పుడు నిరాకరణ భావం వస్తుంది. "రాజకావు" లేదా "దుర్గకావు" అనే పదబంధాల్లో "కావు" అంటే గోడలతో కూడిన రక్షణ స్థలం అని అర్థం. మరికొన్నిసార్లు "నాకు ఇది కావు" అనే సందర్భంలో "కావడం" అనేది ఆశ లేదా కోరికను తెలియజేస్తుంది.

గచ్చు అనే పదం సూత్రం, గీయడం, రూపం అనే అర్థాలతో వస్తుంది. "గచ్చు వేయడం" అంటే ఒక నమూనా తయారుచేయడం. "గచ్చుగా" అంటే సరిగా, స్పష్టంగా అన్న భావం కూడా ఉంటుంది.

ఘనము అనే పదం గౌరవనీయుడు, గొప్పవాడు, ప్రతిష్ఠాత్మకుడు అనే భావాలను సూచిస్తుంది. భౌతిక శాస్త్రంలో "ఘన స్థితి" అంటే ఆంగ్లంలో "సాలిడ్ స్టేట్" అని అర్థం. అలాగే "ఘనత" అనే పదం ప్రతిష్ఠ, గౌరవం అనే అర్థంతో వాడబడుతుంది. గోవు అంటే ఆవు అనే జంతువు. కానీ అదే పదం సాంప్రదాయ రీతిలో పూజనీయమైనది, పవిత్రమైనది అనే భావనను కూడా కలిగిస్తుంది. సామెతల్లో "గోవు" శాంతం, సహనం, దయ అనే సూచనలుగా కనిపిస్తుంది. గోత్రము అనే పదం వంశాన్ని సూచిస్తుంది. ఒక వ్యక్తి ఏ వంశానికి చెందినవాడో తెలిపేందుకు వాడతారు. ఇది సంస్కృత మూల పదం అయిన "గోత్ర" నుండి వచ్చింది.

అలాగే గోవిందుడు అనే పదం విష్ణువు పేర్లలో ఒకటి. భక్తి సాహిత్యంలో, సంగీతంలో, సాధారణ సంభాషణలో కూడా అది భక్తి, ఆనందం, కరుణ అనే భావనలను తెస్తుంది. గాలి అనే పదం వాయువును సూచిస్తుంది. "గాలి వీచింది" అంటే వాయువు ప్రవహించింది. అదే పదం "గాలి వార్త" అనే వాక్యంలో తప్పుడు సమాచారం లేదా అపవాదు అనే అర్థాన్నీ ఇస్తుంది.

గగనము అంటే ఆకాశం. ఇది భౌతిక ఆకాశానికీ, ఆధ్యాత్మిక భావానికీ ఉపయోగిస్తారు. కవిత్వంలో ఇది విస్తారత, అనంతతకు చిహ్నంగా వాడబడుతుంది. ఆట అనే పదం కేవలం క్రీడను మాత్రమే కాకుండా జీవన కదలిక, లీల, కర్మ వంటి భావాలకీ వాడబడుతుంది. "జీవితమంటే ఆట" అనే వాక్యంలో అది తాత్వికతను సూచిస్తుంది.

పరిధి అనే పదం సరిహద్దు, గీత, నియమం అనే అర్థాలతో వస్తుంది. "పరిధి దాటకూడదు" అనే వాక్యంలో అది నియమపాలనకు సంకేతం. పాళీ అనే పదం వంతు, భాగం, క్రమం అనే అర్థాలను ఇస్తుంది. "నా పాళీ వచ్చింది" అంటే నా వంతు వచ్చింది అని అర్థం. పావనము అనే పదం పవిత్రమైనది, శుభ్రమైనది, దివ్యమైనది అనే భావాన్ని ఇస్తుంది.

"పావన గంగ" లేదా "పావన క్షేత్రం" వంటి వాక్యాల్లో ఇది ఆధ్యాత్మికతను ప్రతిబింబిస్తుంది. ఇలా ప్రతి పదం ఒక్కటే అయినా, వాటి అర్థాలు సందర్భానుసారంగా మారుతూ మన భాషకు ప్రత్యేకమైన సౌందర్యాన్ని ఇస్తాయి. ఇదే "ఒక్క పదం అర్థాలెన్నో" అనే గ్రంథం చెప్పే అసలు సారాంశం.

అలాగని ఇదివరకు ఎవరూ ఇలాంటి ప్రయోగాలు అనేక మంది పండితులు చేసారు. శబ్ద రత్నాకం సూరి సూర్య రాయాంధ్ర నిఘంటువు, కేతన, చేమకూరి వెంకటకవి, పుట్టపర్తి నారాయణాచార్యులు వంటివారు చేసారు. వారు చేసారన్న విషయం, ఎలా చేసారు అనే విషయం ఎవరు చెప్పాలి? ఇపుడు వాసిరెడ్డి మల్లీశ్వరి వీరి గ్రంథం భావితరాలవారు అందుకుంటే తీగలాగితే డొంక కదిలినట్లుగా అన్నీ ప్రస్తావనకు వస్తాయేమో! చూద్దాం! శ్రద్ధగా ఒక వైపు ప్రాచీనం, ఆధునికం, మరోవైపు జానపదం వంటి ప్రతి పదానికి కొంత అర్థం, కొన్ని అర్థాలను అందించి తెలుగుకు మరింత గౌరవాన్ని అందించిన మల్లీశ్వరి గారికి అభినందనలు.

గజల్ రచయిత్రి గద్య ప్రామాణికాలను సైతం అందించడం గురించి అందరూ చదివి, దాచుకోవాల్సిందే కదా?



-శైలజామిత్ర
9290900879

పుస్తక సమీక్షలు

# హరి వేంకట లక్ష్మీ ప్రసాదుబాబు-దివ్యశక్తి పద్యపదార్చనలు

లలితకవి, నంది అవార్డు గ్రహీత హరి వేంకట లక్ష్మీ ప్రసాదుబాబు, పద్య రచనలో తొలి అడుగులు వేస్తున్న రోజులలోనే శ్రీ కృష్ణస్తుతి, వ్రాసిన శ్రీకృష్ణ భక్తి తత్పరులైన పద్య కవితాధ్రీణుడు. ఆదర్శ ఉపాధ్యాయునిగా 37 సంవత్సరాలు సేవలందించిన, రచయిత 'శ్రీ పదార్చన' కావ్యంలో 108 పద్యాలతో శ్రీ కృష్ణుడిని స్తుతించారు. పద్య రచనలో చేయి తిరిగిన ప్రతిభావంతులైన లక్ష్మీ ప్రసాదుబాబు పద్యనాటక రచయితగా ఎన్నో గ్రంథాలు వెలువరించారు. వీరి "సులువు గా పద్యం రాయండి" అనే ఛందో గ్రంథం పలువురు పద్యకవులకు కరదీపిక. ఈ భక్తి కావ్యంలో ధ్రువ కోకిల, పద్మనాభం, మధ్యాక్కర వంటి అరుదైన వృత్తాలకు చోటు కల్పించటం విశేషాంశం. సంస్కృత పదాల వృత్తాలు వీరి వైదుష్యానికి అద్దం పడుతున్నాయి. శ్రీ మద్భాగవతంలోని అనేక ఘట్టాలను పద్యస్థం చేసిన కవి "ఎం తటి గర్వమో నెమలి కెన్నగ శక్య మె" అంటూ ఆ గర్వానికి కారణం శ్రీకృష్ణుడు దాని పింఛాన్ని ధరించటం అంటారు. తెలుగు సాహితీ మాగాణంలో విశిష్టమైన హృద్య పద్య సుమాలతో పరమాత్మను అర్చించిన "శ్రీ పదార్చన" తెలుగు భాషామతల్లికి ఒక దివ్య భూషణంగా సమర్పించిన హరి వేంకట లక్ష్మీ ప్రసాదుబాబు ధన్యులు.





**ప్రతులకు:** హరి వేంకట లక్ష్మీ ప్రసాదుబాబు ఇ.నెం. 6-2-122/ఎ/1, జమ్మిబండ పార్కు దగ్గర, ఖమ్మం-507 002. సెల్:9440083119



భద్రాచల శ్రీరామచంద్రుని అర్చించిన భక్త శిఖామణి పోకల దమ్మక్క స్ఫూర్తితో, భక్త రామదాసు దాశరథీ శతక ప్రభావంతో హరివేంకట లక్ష్మీ ప్రసాదుబాబు మరొక శతకం 116 పద్యాల, పద్యమాలికప్రసాద రాఘవమ్ "రాఘవా" అనే మకుటంతో మరు గున పడిన వృత్తాలను ఎన్నుకొని అద్భుతంగా సమర్పించారు. గణాలు, యతిస్థానాలు వివరిస్తూ 116 వృత్తాలతో తెలుగు పద్య కావ్య ప్రపంచానికి కొత్త వెలుగు ప్రసరింప చేసారు. లక్షణ గ్రంథాలలో వివరించిన వృత్తాల లక్షణాలను సైతం అందిస్తూ విలక్షణ వైచిత్రీ ప్రక్రియగా 'ప్రసాద రాఘవమ్' భద్రాద్రి రామ రసధునిగా పవిత్ర దివ్య ఆశీస్సులు వెదజల్లు తోంది.



-జయసూర్య
సెల్:9440664610

## సర్పంచి

ఊరికి సర్పంచన్న
నువ్వే నవాబువన్న
ఓటుతో గెలిచితివి
అధికారము నీదన్న!!

గుంతలన్ని పూడ్చేయి
రోడ్లన్ని బాగుచేయి
మొక్కలే నాటించి
ఊరికే మంచిచేయి!!

సంఘాలను స్థాపించు
నియమాలను పాటించు
కలిసిరాని సభ్యులను
దూరంగా తొలగించు!!.

కులము నీదేదైన
మతము నీదేదైనా
వాటితో పనిలేదు
ఆచారమేదైన!!

అధికారం ఐదేండ్లు
నమ్మకమే నూరేండ్లు
పనితనం జూపిస్తే
మల్లిత్తరు ఐదేండ్లు!!.

సర్పంచే సగం బలం
ఆ ఊరికి మనోబలం
పనితనంతో స్థాపించు
హృదయాలలో స్థిరబలం!!



-తాండ్ర చిరంజీవి
99591 80762

## సర్పంచ్

ఓయీ సర్పంచ్
నీవే గ్రామానికి తలమానికం
నీదే గ్రామానికి పెద్దరికం !
నీతోనే ఊరికి సిరి
నీకు అభివృద్ధిపై ఉండాలి గురి
నీవు ఆదర్శంగా ఉంటే సరి
నీకెవరు సాటి రారు మరి !
గ్రామ పరిపాలన
బరువు బాధ్యతలు మోస్తున్నావు
ప్రభుత్వ పథకాలను
గ్రామ పూజారివై వరాలుగా
అందిస్తున్నావు
నీవే గ్రామానికి అండ దండవు
అందరికీ కావాలి
బంగారుకొండవు!
ఎందరినో కాదని
నిన్ను వరించింది పదవి
ఓటర్లెప్పుడు బలి చక్రవర్తులే !
నీ దోసిలి లో ఓటర్ల దారపోత
విష్ణు మూర్తికి మూడడుగుల నేల
దార పోసినట్టు!
వారి చేతులెప్పుడ
పైనని మరువకు
ఐదు సంవత్సరాల ప్రజాస్వామ్య
అట్టడుగు పాతాళ గ్రామ పాలిత!
ఇక నీవే గ్రామానికి పెద్ద దిక్కువి
ప్రజాస్వామ్య ఏలుబడిలో
నీ పరిపాలన కావాలి
గ్రామ స్వరాజ్యానికి కొలమానం!
ప్రజాస్వామ్యానికి
గ్రామాలు పట్టుకొమ్మలు
గ్రామానికి సర్వం తానైన
ఓ విరాట్ రూపం సర్పంచ్ !



-పట్లోళ్ళ బక్కారెడ్డి
9705315250

## ఎంకి-నాయుడుబావ ప్రణయాన్ని వర్ణించిన నండూరి ఎంకి పాటలు



సభలో మాట్లాడుతున్న జస్టిస్ నాగమారుతిశర్మ.

హైదరాబాద్, డిసెంబర్ 17: (నేటినిజం ప్రతినిధి): ప్రసిద్ధ గేయ రచయిత నండూరి వెంకటసుబ్బారావు రచించిన ఎంకి పాటలు ఎంకి-నాయుడుబావ ప్రణయాన్ని సహజ పల్లెపాటలుగా అందరి నోట పలికాయని సీబీఐ కోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతిశర్మ అన్నారు. త్యాగరాయ గానసభలో భాగంగా నండూరి వెంకట సుబ్బారావు యాదిలో సమావేశం తెలంగాణభాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాగమారుతిశర్మ మాట్లాడుతూ గురజాడ అప్పారావును గురువుగా భావించిన నండూరి భావ కవిత్వాన్ని అనుసరించారన్నారు. ఆయన తెలుగు సాహిత్య అకాడమీ అవార్డు పొందారని వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘసేవకులు పీఎస్ఆర్ మూర్తి, కవి రఘుశ్రీ, పాలకమండలి సభ్యుడు గుండవరపు గీతాదేవి పాల్గొన్నారు.



తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..

నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

## అందమంటే నాకు చాలా ఇష్టం

అందం నాకు చాలా ఇష్టం.
నా చూపు అందం వైపు.
పరిగెడుతూనే ఉంటది అందుకే
అందమంటే నాకు చాలా ఇష్టం.
నాకు ఇష్టమైనది ఏదైన
అందంగానే కనిపిస్తది.
చీరకట్టులో స్త్రీకి నిండుదనం.
బొట్టులో సౌభాగ్యమే అందం
అల్లుకున్న కురుల జడఐన.
వయ్యారపు నడకైన
నవ్వుల పలకరింపైన
నా చూపుకు మహా ఇష్టం.
పుడమి తల్లి ఎదపై పచ్చని పైరు
ఈనినప్పుడు పంటసిరులు
గాలి వాటానికి ఊగిసలాగుతు
శ్రావ్యమైన సరాగ సవ్వడుల.
వినికిడి స్పర్శ అందాన్నే దర్శిస్తది
ఎడారి క్షేత్రాన బగ్గనమండే
వేసవిలో పచ్చదనం.
నిలువెల్ల నింపుకుని
ఎర్రెర్ర మోదుగుపూల అందం.
ముద్దొస్తది
అందుకే అందమంటే నాకు
చాలా ఇష్టం.
కొండలను పెనవేసుకునే
పాలమబ్బులు.
రాళ్ల గుట్టలపై పర్చుకున్న
పచ్చటి చిక్కటడవి పొదలు
జాలువారే సెలయేరు గలగలల.
అందాలు ముద్దొస్తుంటాయి.
అందుకే నా చూపుకు
అందమంటే మహా ఇష్టం.
పొద్దు పొద్దున్నే పొడిసేటి
సూరీడు.
నీళ్లనే ముద్దాడినప్పుడు
వెన్నెల కాసే సెంద్రుడు
నీళ్ల అలల్లో మునకలేస్తుంటే.
నా చూపుకు ఇష్టం.
అందుకే అందమంటే నాకు
చాలా
ఇష్టం.
పచ్చటి ఉద్యాన వనంలో రంగు
రంగుల పూలు రెక్కలిప్పుకుని.
పరిమళాలు గుప్పున వెదజల్లే.
ప్రకృతి అందమంటే నాకు
చాలా ఇష్టం.

-యరకల యాదయ్య.
9866468979.

## కోపం

ముక్కు మీది కోపం
ముఖానికి ముద్దు కావచ్చు
మునులకు వుంటే వుండవచ్చు
ఋషి కోపాలు వరాలై
వర్ధిల్లవచ్చు !
సూర్యుని ఎండలో
అల్ట్రా వైలెట్ కిరణాలున్నట్లే
మనిషి లో
కోపం శాంత చిత్తాలుంటయి !
ఎండ పోయి వెన్నెల వచ్చునట్లు
కోపం చల్లారితే
పాలమీగడల శాంతమే
కోపం మనిషిని కాల్చేసే క్రోధాగ్ని
శాంతం మనిషిని
సంస్కరించే తంత్రం!
పేదవాడి కోపం పెదవికి చేటు
కోపంలో తపఃఫలం
వృధా చేసుకున్న ఋషులెందరో
కొరకొర చూపుల కొంగను
కాల్చిన
కౌశికులెందరో!
కోపం ఎన్ని అనర్థాలకు
దారితీసిందో
ఎన్ని అవకాశాలు
జారవిడుచుకున్నదో
కోపానికి క్రోధం తోడైతే
అగ్నికి.. ఆజ్యం పోసినట్లే!
కోపాన్ని నీ దరి చేరనీయకు
ఒకసారి చరిత్రను
అవగతం చేసుకో
ఎండ వెండి వెన్నెలగా మారినట్లు
నీ కోపాన్ని శాంత మత్వంగా
మలుచుకో!

-పట్లోళ్ళ బక్కారెడ్డి
9705315250

## అమ్మ నిద్ర..

అమ్మ రాత్రి
నిద్రపోతుందో లేదో!
అన్నీ జాగరణలే అమ్మకు
కప్పుకున్న మా దుప్పటి
చెదిరినప్పుడల్లా
అమ్మ మెలుకువగా ఉండి
నిండా కప్పుతునే ఉంటుంది!
పిట్టకైనా కునుకు
అమ్మకు కునుకుకు
అసలే పడదా ఏమి!
"అమ్మా మధ్యాహ్నమైనా
నువు నిద్ర పోతే ఆరోగ్యం"
"ఛీ !
ఎవరైనా పగలు నిద్రపోతారా"
పగటి నిద్ర పనికి చేటు !
వాష్ బేసిన్ లో అంట్ల గిన్నెలు
చెంచలు అల్లరి చేస్తాయి కదా!
రేపటి నుండి అమ్మ నిద్ర పోయాకే
మేము నిద్ర పోతాము!
పైని బ్లాంకెటు చెదరకుండా
గురక రాకుండా నిద్ర పోతాము!
మేము గురక ప్రారంభం చేస్తే
అమ్మ నిద్ర మొదటికే వస్తుంది!
"అమ్మా నిద్ర పోయావా!"
"ఊ ! నిద్రపోయాను!"
పిచ్చి పిల్లలు మీరు నిద్రపొండి
మీకు రేపు సెలవు లేదు
నేను ఇంట్లోనే ఉంటాను
నాకు రోజూ సెలవే!

- కందాళై రాఘవాచార్య
8790593638

## పూలాలయం

పూలమ్మా పూలు
కవితలమ్మా కవితలు
రండి! బాబు రండి!
స్పర్శించండి!
దర్శించండి !
పూలంటే పూలు
బుట్టలలో
పుటలుపుటలుగా
నింపినపూలు !
శిరీషపుష్పాలు
గులాబీలు
మల్లెలు
చామంతులు
రకరకాల పూలు రకరకాల
కవితలు
ఒకటి రెండు మూడు నాలుగు
ఐదు ఆరు పంక్తుల కవితలు
మినీకవితలగుత్తులు
పెద్దకవితలహారాలు
దీర్ఘ కవితల దండలు
ఎన్ని సాహిత్య ప్రక్రియలో
అన్ని రకాలపూలు
ఎన్ని రకాలపూలో
అన్ని రకాల సాహిత్య ప్రక్రియలు
కవితలైనా
పూలైనా
సుగంధ భరితాలు
ప్రబంధ చరితాలు
ఆడపడుచుల కొప్పులకోసమో
దేవతల మెప్పులకోసమో
ప్రేమ కోసం ఆరాధిస్తాం
భక్తి కోసం అభిషేకిస్తాం !
ఏది ఏమైనా
పూల కవితలను
అంకితమిస్తాం !
సన్మాలకు సత్కారాలకు
పూల కవితలు
కవితల పూలు
అన్నీ పూలకవితల మాలలే !
పెళ్ళిమంటపం లాంటి
గ్రంధాలయం !
గ్రంధాలయం లాంటి
పెళ్ళిమంటపం !
తీరొక్క పూవు
తీరొక్క కవిత
పూలపుస్తకాలను నమ్ముకొని
చదువుకోవటం తెలుసుకోవాలి
పూలమ్మిన దగ్గర
కట్టెలమ్ముకోవద్దు
సూది ఒక కలం
దారం ఒక ధార
హారాలు హారాలుగా
దారాలు దారాలుగా
కొట్టు దండానికి కట్టి
వేలాడదీస్తే
ప్రాంగణమంతా
సొగసు పరిమళం
ముక్కుపుటాల నెగరేస్తుంది
కళ్ళరెప్పల్ని నిలిపేస్తుంది.
సూది ఒక ఉలి
దారం ఒక శిల
నగిషీలు నగిషీలుగా చెక్కుతాయి!
పుస్తకాల విగ్రహాలమీద
నవరస పోషణనింపుతాయి
నాట్యభంగిమల విన్యాసాలు
వొంపుతాయి.
పూలే
పుస్తకాలు !
సాహిత్యమే
ఒక పూల దుకాణం !!

-కందుకూరిశ్రీరాములు
9440119245



## తీక్షణ వీక్షణంలోంచి..

ఈ క్షణం
తీక్షణంగా నిరీక్షణ చేస్తున్నాను
అక్షరాల దొంతరల్ని
పేర్చుకుంటున్నాను.
నిరీక్షణ వీక్షణంలోంచి లేచి
ఏవో క్షణాల్ని ఏరుకుంటున్నాను.
ఏకాంతం రాలుతుందో
అక్షరం ఏలుతుందో
మదిలో తుపానులు
తరుముతుంటాయి.
మనిషి మనుగడని
తురుముతుంటాయి.
అస్తిత్వం ప్రశ్నలు
కుదుపుతూ ఉంటాయి.
కాలం తో పోటీ పడటం
సవాళ్ళకు పరిష్కారాలు
అన్వేషించడం తోనే
క్షణాలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.
నాది కాని ప్రపంచంలో
నెగ్గికు రావాల్సిన
సందర్భాలు ఉంటాయి.
ఏం క్షణం నాది కాకపోయినా
తీక్షణంగా పరీక్షణ చేస్తే
ఏదో కొత్త రూపం లో
వెలుగు రేఖలు
కన్పిస్తుంటాయి.



- గవిడి శ్రీనివాస్
7019278368

## కలవరం

కాకతాళీయమో
లేక దేశ కాల పరిస్థితులో
నిద్రలోను నిస్సహాయతే
కుదురుకోలేనంత 'కలవరం'.
కాళ్లు చేతులు కట్టేసి
కొట్టినచోట కొట్టకుండా
కొరడా దెబ్బలు కొట్టినట్టు
పేయ్యంత పచ్చిపుండైనంత
'కలవరం'.
పచ్చిగడ్డి పట్టుకుంటే
వెచ్చని నెత్తురంటినట్టు
చెవులలో ఫిరంగులు పేలినట్టు
ఊపిరి సల్పనంత 'కలవరం'.
చెట్లు కూలిపోతున్నట్టు
గుట్టలు పేలిపోతున్నట్టు
అడవి కాలిపోతున్నట్టు
నరాలు తెగిపోతున్నట్టు 'కలవరం'.
దర్పం వెలగబెడుతున్న డాలర్ ముందు
ద్రవ్యోల్బన దయ్యం పట్టినట్టు
జీతం చాలక జీవితం
కుడితిల పడినట్టు
దయనియస్థితికి చేరుకున్నంత
'కలవరం'
మౌనంగానే మదన పడుతున్నట్టు
మూకలను చూస్తూ మూగనైనట్టు
సలిపి సలిపి చలిజ్వరంతో
వణుకుతున్నట్టు
కలతనిద్ర కలలో కూడా
ఒకటే 'కలవరం'



-డా.ఎడ్ల కల్లేశ్
9866765126





# శ్రమజీవన మహావృక్షం యాదయ్య కవిత్వం



యరకల యాదయ్య కవిత్వ జెండాను పట్టుకుని నాలుగు అడు గులు వేయండి. ఆయన లోపలి ఎజెండా మీకే అర్థమవుతుంది. పది మందిని అడగాల్సిన పనే లేదు. ఆయన శ్రమ జీవుల మనిషి. ఆయన కవిత్వం కూడా వారిదే. వారి జీవన చైతన్యమే ఆయన కవితా చైతన్యం. ఆయన చైతన్యం కూడ. యాదయ్య కార్మికుడు. కార్మిక చైతన్యం వారినుంచే అబ్బింది. గాఢమైన స్నేహ బంధాల వల్లే శ్రమ జీవనంలో మమేకమయ్యాడు. ఆ మమేకమయ్యే గుణం బాల్యం నుంచే అబ్బింది. ఆయన శ్రమైక జీవి. శ్రామికులు, కార్మికులు, కర్షకులు యాదయ్య జీవితానికి మార్గదర్శకులు. వారి శ్రమజీవన మహా వృక్షమే యాదయ్య కవిత్వ మైంది. యాదయ్య వ్యక్తిత్వమూ జీవితమూ శ్రమ సౌభాగ్యం లోంచే రూపుదిద్దుకున్నది. శ్రమకు తగిన ఫలితం దొరకనప్పుడల్లా గాయపడుతూ వచ్చాడు. శ్రమజీవుల వేదనలకు, ఆవేదనలకు, వలపోత లకు ఓదార్చే ఆత్మబంధువయ్యాడు. వారిలోని అనా రోగ్యం, అవిద్య వెంటాడింది. శ్రామిక కార్మిక, కర్షక జీవితాలకు తగిన కార ణాలు కారల్‌మార్క్సుకు తెలుసన్నట్లు మన యాదయ్యకు తెలుసు. వ్యవస్థలోని సమస్త అధిపత్యాల వల్ల, స్వార్థాల వల్ల, కుట్రల వల్ల, కుతంత్రాల వల్ల, మోసాల వల్ల, ఎత్తుగడల వల్ల, అణగదొక్కడాల వల్ల శ్రమ సృష్టిలో ఎన్నెన్ని మాయలు చొరబడి వారి జీవితాలను పీల్చిపిప్పి చేస్తున్నాయో పసిగట్టి స్పష్టంగా ఈ విప్పి చెప్పే కవిత్వం రాశాడు. శ్రమ కంటకుల భరతం పట్టాలన్న ఉద్దేశ్యం మనసులో ఉంచుకుని 'నీటి అద్దం' సంపుటంలో 80 కవితలు రాశాడు. ఇది ప్రధానంగా శ్రమ జీవుల కవిత్వం. పాఠక హృదయా లను మేల్కొల్పే కవిత్వం. చైతన్య పరిచే కవిత్వం. నీటి అద్దంలాంటి కవి యాదయ్యకు మంచి భవిష్యత్తు ఉన్నదని గాఢంగా నమ్ము తాను.

యరకల యాదయ్య ఈ నీటి అద్దం తొలి సంపుటం కాదు. చివరి సంపుటం కాదు. ఇదివరకే అక్షర మాలలు, శ్రమపొదుగు, లోకం పోకడ అనే మూడు కవితా సంపుటాలను ప్రచురిం చాడు. నీటి అద్దం నాల్గవ కవితా సంపుటం. ఇందులోని మొత్తం కవితలు, ఇదివరకటి సంపుటాలలోని మొత్తం కవితలు 261. లోకం పోకడలో 178 మినీ కవితలున్నాయి. ఒక తమాషా చేసి ఏ మినీ కవితకు శీర్షిక పెట్టకుండా ప్రతి మినీ కవిత కింద చిన్ని చిన్ని చుక్కలు పెట్టి ఒక దీర్ఘ కావ్యంగా ప్రచురించాడు. నిజానికి ఇదేది గమనించకుండా చదివితే ఒక కావ్యమన్న భావన కల్గుతుంది. ఈ కావ్యం చివరన 'నా నగరం తెలంగాణ మణిహారం' అన్న ఒక దీర్ఘ కవితను ప్రచురిం చారు. యాదయ్య శ్రామికుడి గా జీవిస్తూ 2016 నుండి నేటికి జీవితాన్ని కవిత్వానికే అంకితం చేస్తూ రాస్తున్నందుకు ఆత్మీయునికి అభినంద నలు చెప్పక తప్పదు. యాదయ్య వచన కవిత్వంలో పాటలు కూడకట్టాడు. పాటల్లో దిట్ట అని అనిపించుకునే లోపలే ఆ రహదారిని మార్చుకుని ప్రధాన మార్గం వచన కవిత్వమే అని నిర్ధారించుకున్నాడు. తొలి రోజుల్లో ఆయన వచన కవిత, గేయం, శతకం రచన దారిలో కొట్టుమిట్టాడింది. వచన కవిత్వ రహదారిని వెతికి వెతికి పట్టుకుని యాదయ్య కవిగా స్థిరపడుతున్న సందర్భంలో ఈ 'నీటి అద్దం' వచ్చింది. ఆయనకు ఆత్మీయుడు నందిని సిధారెడ్డి. ఇందులో ఒక కవిత ద్వారా తన అభిమానాన్ని చాటుకున్నాడు. యాదయ్య తెలంగాణ ఉద్యమంతో మమేకమయ్యాడు. ప్రస్తుతం తెలంగాణ రచయితల సంఘం సభ్యుడు. ఆయన స్నేహగుణం సంఘానికి స్ఫూర్తి దాయకం కూడ.

యరకల మాదయ్య అమాన వీయతకు ఆమడ దూరం ఉంటా డు. మానవీయతకు ఒక యించ్ దూరం కూడ ఉండదు. విలువలు లేని మనుషులన్నా సమాజమన్నా ఆయనకు గిట్టదు. అమానవీయతకు తట్టుకోలేక కవితలు రాశాడు. విలువలు లేని మనుషుల పట్ల, సమాజం పట్ల తీవ్ర వ్యతిరేకతతో కొన్ని కవితలు రాశాడు. ముఖ్యంగా పాలకుల ద్వంద్వ ప్రవృత్తిని ఎక్క డికక్కడ ఎండగట్టాడు. తల్లిదండ్రుల ప్రేమను, తెలుగు భాషపై మమకా రాన్ని కవిత్వంలో చాటుకున్నాడు. కార్మి కుడిగా పనిచేసిన సంస్థను స్మరించాడు. ఆయన నల్లగొండ జిల్లాలోని నకిరేకల్ మండలం నోముల గ్రామంలో జన్మిం చటం వల్ల గ్రామీణ జీవితం ఆయనలో ఒక భాగం. అలాగే పట్నంలో జీవించడం మరోభాగం. ఈ రెండు భాగాల ప్రజల జీవితాలతో పెనవేసు కుని జీవిస్తున్నాడు. ఈ రెండు జీవితా లలోని సంస్కృతి ఆయనలో ఉంది. ఈ నీటి అద్దంలోని కవితల్లోను -ఆయన కవిత్వంలోని ప్రధాన గుణం శ్రామిక జీవనమే. వారి జీవితాల్ని చిన్నాభిన్నం చేస్తున్నది ఆధిపత్య శక్తులే. పాలకులే. సంపన్నులే. వ్యాపార మార్కెట్టే. వీటి ద్వంద్వ ప్రవృత్తుల మధ్య నలిగిపోతున్న శ్రమ జీవుల పక్షాన నిలబడి స్పష్టంగా చాటిన కవితా సంపుటం నీటి అద్దం. ఈ కవితల మనోని లయంలో శ్రమైక జీవులదే ప్రధాన భాగం. యరకల యాదయ్య సహజమైన స్నేహశీలి. మంచి కవులను తల్లిదండ్రులుగా భావిస్తాడు. ఆరాధిస్తాడు. వారితోనూ వారి కవిత్వంతోను మమేకమవుతాడు.



ప్రతులకు: యరకల యాదయ్య
ఇ.నెం.25-36/4/4జె
మల్లిఖార్జున నగర్, భీంగూడకమన్ దగ్గ, రామచంద్రాపురం
హైదరాబాద్-502 032.
సెల్: 98664 68979

ఎంతో కొంత నిత్యం వారినుంచి కవిత్వం ఒంటబట్టాలని శ్రమిస్తాడు. యాదయ్య కవిత్వంలో నిర్మాణ గాఢతకన్న వస్తు గాఢత ఎక్కువ. ఏ కవిత తీసుకున్నా వస్తువు సెలయేరులా సాగుతుంది. వస్తువును పక్కన పెట్టి ప్రతీకల వెంటపడిపోడు. ఊహల దారులతో దాగుడు మూతలు ఆడడు. భాషార్భాటం ఉండదు. తన జీవన నేపథ్యం నుంచి వచ్చిన ఊహలే కవిత్వంలో వాలినాయి. అడవి

**వ్యవస్థలోని సమస్త ఆధిపత్యాల వల్ల, స్వార్థాల వల్ల, కుట్రల వల్ల, కుతంత్రాల వల్ల, మోసాల వల్ల, ఎత్తుగడల వల్ల, అణగదొక్కడాల వల్ల శ్రమ సృష్టిలో ఎన్నెన్ని మాయలు చొరబడి వారి జీవితాలను పీల్చి పిప్పి చేస్తున్నా యో పసిగట్టి స్పష్టంగా ఈ విప్పి చెప్పే కవిత్వం రాశాడు.**

మనుషులు మొదలుకొని కాగితాలేరుకుని బతికే వారి జీవితాలకు ఏతం పెట్టి కవిత్వం పండించాడు. కష్టజీవుల అస్తిత్వమే ఆయన కవిత్వ అస్తిత్వం. ఓటుకు అమ్ముడు పోయే వారిని యాదయ్య కవిత్వం ప్రేమించదు. ఓటును కొనుక్కునే వాన్ని అసలే ప్రేమించదు. ఓట్లు కొనుక్కుని నాయకులైన వాళ్ళను పాలకులైన వాళ్ళను తనదైన కవిత్వ చింత బరిగెలతో కొట్టి కొట్టి ఎద్దేవా చేస్తాడు. వ్యంగ్య బాణాలు వేస్తాడు. దుర్బుద్ధులను ఎండగడతాడు. యాదయ్య కవిత్వంలో సహజత్వం, సూటిదనం, నిర్మల త్వం మెండుగా ఉంటాయి. పాలకుల హిపో క్రసీని నిలువునా పాతేయాలను కుంటాడు. తల్లిదండ్రుల ప్రేమను బిడ్డలు పరిపూర్ణంగా పొందాలను కుంటాడు. వృద్ధాప్యంలో తల్లిదం డ్రులను వదిలేసి డబ్బుకు దాసోహం అనే పిల్లలను వ్యంగ్య వెటకారా లతో దెప్పి పొడు స్తాడు. మనిషిని మించిన నటుడు రంగస్థల నటులు కాదంటాడు. ద్వంద్వ పూరిత నటుల సమాజంలో రంగస్థల నటులే నయమంటాడు.

'నేతి బీరకాయనీతి' పాలకుల నీతికి ఎలా చెదలు పడుతుందో చెప్పాడు. దైవాన్ని సైతం అమ్ముకునే దైవ ప్రభువుల పాలనలో నేతి బీరకాయలోని నీతంతైనా నీతి లేదంటాడు.

**"ఒకప్పుడు తమ సేవతో**
**లోకానికి వెలుగులు నింపేవారు.**
**ఇప్పుడు తమ సుఖంకై**
**లోకాన్ని పీడించుకునేదే"** నేటి పాలకుల తత్వం. అదే నేటి ధర్మపాలన.

యాదయ్య కవిత్వంలో రైతులు శ్రమ జీవులే కాదు. బుద్ధిజీవులు కూడ. అయినా వాళ్ళ బతుకులు ఇట్లా ఎందుకున్నాయని వేదన చెందుతాడు. వారి పనితనాన్నీ, సౌందర్యాన్ని పాఠకులకు పంచుతాడు.

**"వారి చూపంతా పచ్చని పైరు మీద**
**నింగిలో పరుగులు తీసే మేఘాలవైపే**
**వారి ధ్యాసంతా పుట్లకొద్ది పంట దిగుబడి కొరకే**
**నిరంతరం శ్రమను వొలికించే చతురులు**
***పాడి పంటలను ఓలలాడించే ప్రగతి శీలురు"*** రైతులు.

ఈ శ్రమైక జీవులు పాలకుల ద్వంద్వ ప్రవృత్తుల వల్ల / రైతులు ఏ పాలకుల వైపు నిలబడాలో తెలియని ఆయోమయ పరిస్థితి. ఆకాల ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నేలపాలైనా చేయూతనిచ్చే పాలకులేరి? పంట చేతికొచ్చినా గిట్టుబాటు ధరకు దూరమైన రైతుల హృదయ ఘోషను గొంతెత్తి విన్నవిస్తాడు.

యాదయ్యకు రోడ్లూడ్చేవారన్నా మల మూత్రాలు ఎత్తిపోసే వారన్నా ఎంతో గౌరవం. కాగితాలు ఏరుకుని బతికే వారే కాదు రెండు చేతులను కాళ్ళను నమ్ముకుని బతికే శ్రమజీవులతో యాదయ్య కవిత్వం మమేకమవుతుంది.

**"చెత్త కుప్పల్ని శుద్ధి చేసే**
**పూటకు గతిలేని పేదోళ్ళు**
**వాళ్ళ గమనం వారి గమ్యం**
**వాళ్ళే ఎరుగనోళ్ళు**
**కల్లా కపటం ఎరుగని**
***మానవ జాతి మూగజీవులు"***

చేతి వృత్తి శ్రామికులు. వాళ్ళకున్న ఆయుధాలు కాళ్ళు చేతులే కదా! చినిగిన పాతబట్టల మాటున దాచుకున్న మానాభి మానాలను మననం చేసి కవిత్వంలో వర్ణించాడు.

**"తుప్పు పట్టి చీకిపోయిన లోహపు ముక్కలు**
**వాడి పడేసిన పాల్తిన్ కవర్లు**
**విరిగి పగిలిన పైపు ముక్కలే వారికి ఆస్తి**
***ఏ రోజు కారోజు పూట గడపటమే యజ్ఞం"***

శ్రీశ్రీ అన్న వ్యథార్థ జీవన యదార్థ దృశ్యమే ఈ కవిత, చీకిపోయిన లోహపు ముక్కలు, పాల్తిన్ కవర్లు, విరిగిన పైపు ముక్క లాంటివే వాళ్ళ జీవితాలు. యూజ్ అండ్ త్రో వస్తువు లాంటి వారే వాళ్ళు. వాళ్ళ జీవితాలకు వెలుగులు నిండాలని యాదయ్య కవిత్వం ఆకాంక్షిస్తుంది. మల మూత్రాలు ఎత్తిపోసే వారికే స్వచ్ఛభారత్. అయిన వాళ్ళ స్వేచ్ఛా భారత్‌ను ఎప్పుడు నిలుపుకుంటారో కదా! మురికిని శుభ్రం చేసేవాళ్ళు ఒక పక్కనుంటే తెల్లబట్టలేసుకున్నోళ్ళు మురికి మోసాలు చేస్తున్నప్పుడు వాళ్ళు లోపలి మురికిన్ని ఎవరు ఎత్తిపోయాలి? మురికి లేని తెల్లబట్టల వాళ్ళు మురికిని తొలిగించుకోరు కదా! ద్వంద్వ మలినాన్ని ఎత్తిపోసినప్పుడే స్వచ్ఛ భారత్ దర్శనమిస్తుంది.

యాదయ్య శ్రమజీవులు సంఘటితం కావాలని హితం పలుకుతారు.

**"ఎవరికి వారమే సామాన్యులం**
**కలిసి గట్టుగా నడిస్తే**
**కార్యాచరణకు వెలుగు దివ్వెలం"**

ఇవే శ్రమజీవులకు మేలుకొల్పు పాదాలు. లోకంలో కనిపించే ప్రతి వస్తువు వెనకాల, కనబడని చెమట దారబోసిన కార్మికులే ఉన్నారు. దేశాభివృద్ధిలో భాగస్వాములైనా వారి జీవితాల్లో వెలుగులు లేవు. సంఘటితమైతే తప్ప వారి జీవన మార్గం సుగమం కాదంటాడు యాదయ్య.

అడవి బిడ్డలపైన 'కుట్రలేతెలవనోళ్ళం' అన్న కవిత ఒక మంచి కవిత. అడవి బిడ్డల బతుకంతా చెట్లు, పుట్టలు, కొండలు, కోనలే. సహజత్వమే వాళ్ళ మనుగడ. రాత్రుళ్ళు వెన్నెలే వారి ఇంటి దీపాలు. రాలిపడ్డ పండ్లు కాయలే వారి మూలధనం. చినుకులు రాలిపడినప్పుడు, కుండపోతగా వర్షాలు కురిసినప్పుడు వారి బతుకంతా చిందరవందర కాకమానదు. అడవిని గాలించే క్రూరమృగాల కంట పడినప్పుడల్లా నక్కి నక్కి జీవించే జీవశ్చవాలు అడవి బిడ్డలు.

**"మేము గూడ గీ దేశం బిడ్డలమేగా!**
**మేమేమన్న కోటలు అడిగితిమా!**
**కోట్లు కూడ గట్టుకుంటమా!**
**అడవి దాటి ఊరు పట్నం ఎరుగనోళ్ళం**
**అడవి బిడ్డలమై యుండి**
**అమ్మలాంటి చెట్లను నరుకుతమా"**

ఈ కవిత చదివితే హృదయం ద్రవిస్తుంది. పాలకులు, వాళ్ళ మనుషులు అడవి బిడ్డలపై నిందలు వేస్తారు. చెట్లను నరుకుతారనే నిందవెనక మోసం ఎంత దాగుందో దేశానికి తెలియదు. చెట్లు నరికే దొంగలెవరో, నరికించే దొరలెవ్వరో లోకానికి తెలియదు. జీవితాల్లో నిప్పులు పోసి అభియోగాలు పెట్టి చంపటమేమిటి? సహాయం చెయ్యాల్సిన పాలకులు సంహరి స్తామంటే ఎట్లా? యాదయ్య స్పష్టంగా అడవిబిడ్డల పక్షాన నిలబడి ఈ కవిత రాసిందు.

ఊరవతలి అడవి బిడ్డల మీదనేకాదు ఊరిలోని పశువుల కాపర్ల మీద ఆర్ద్రమైన కవిత రాసిందు. అలాగే పని లేకున్నా తీరికెక్కడిదని ప్రపంచీకరణ నేపథ్యంలో మరో కవిత రాశాడు. కష్టపడే వాళ్ళకు తీరిక లభించదు. మాధ్యమాల వల్ల పల్లెలకు టీవీలు వెళ్ళాయి. సెల్‌ఫోన్లు వెళ్ళాయి. గ్రామాలు పనిలో నిమగ్నం కావల్సిన చోట వాళ్ళ జీవితాలు ప్రేక్షక పాత్రలోకి నిర్ధాక్షిణ్యంగా నెట్టివేయ బడుతున్నాయి.

**"గంప కింద బందించిన కోళ్ళ లెక్క**
**ప్రపంచీకరణ ఉచ్చులో చిక్కుకుని**
**ఎవరికి వారు నాల్గు గోడల నడుమ**
**అమ్ముడుపోయి కమ్మేసుకుంటున్నరు.**
**కష్టపడ్డ దేహాలు కాస్త కూలబడాలనుకున్న**
**కుట్రలు, కుతంత్రాల ధారావాహికల పదర్శనలు"**

ఈ ధారావాహికల సీరియల్స్‌కు ఆడిందే ఆట పాడిందే పాటగా మారిపోయింది. భారీ తెరలు పట్నాల పక్కనైతే బుల్లి తెరలు గ్రామాల్లోకి చొరపడి ప్రజల్ని ప్రేక్షకులుగా మార్చుతున్నాయి. ఈ వినోదం వల్ల జరుగుతున్నదేమిటి? నలుగురి మధ్యన బాధలెల్లబోసుకునే శ్రమజీవులకు -ఈ ప్రేక్షక పాత్ర నెత్తిమీద వచ్చిపడింది. మనిషికి మరో మనిషి తోడు నీడ. ఈ మాధ్యమాల వల్ల మనుషులకు యంత్రాలు తప్ప, మనుషులు దొరకని ఒక విచిత్ర విషాదం పల్లెల్లోకి వచ్చి చేరింది. యాదయ్య కవిత్వంలో జీవన సూక్ష్మాలు కోకొల్లలుగా దొరుకుతాయి.

నీటి అద్దం కవితా సంపుటం చదివితే శ్రమ జీవన సౌందర్యం లభ్యమవుతుంది. యాదయ్య శ్రమజీవుల బతుకులకు పురుడుపోసాడు. యాదయ్య కవిత్వం స్థిర వస్తువును కవిత్వం చేసింది తక్కువే. చలన పూరితమైన సమాజాన్ని కవిత్వం చేసిందే ఎక్కువ. యాదయ్య కవిత్వానికి దృష్టి, దృక్పథంతో పాటు ప్రయోజనం ఉంది. ఈ సంపుటంలో అర్థం కాని కవిత లేదు. అర్థంకాని పదం లేదు. శైలి కాస్త సాంద్రంగా గాఢంగా మరింత తాత్త్వికమైతే మరింత బాగుందు అనిపిం చింది. అందుకు మరింత శ్రమిస్తాడనే భావిస్తాను.

*(యరకల యాదయ్య రచించిన 'నీటి అద్దం' పుస్తకానికి డా॥నాళేశ్వరం శంకరం రాసిన ముందుమాట..)*



- డా॥ నాళేశ్వరం శంకరం
944045 1960

# అనుభూతులకు అక్షర హారతి

ఒక మనిషి సుదీర్ఘమైన జీవి తంలో ఎన్నో ఆనందాల సందర్భాలు ఉండటం సహజం. వాటి తాలూకు అనుభూతులు జీవిత పర్యంతం గుర్తు కు రావడం సహజమైన విషయం. అయితే కొందరు వారి జీవితంలో జరిగిన అనేక సందర్భాలను అక్షరీక రించడం చేస్తారు. అలాంటివారు చాలా తక్కువ మంది ఉంటారు. ఎం దుకంటే ఇలాంటి వారికి నిబద్ధత ఉండాలి. ప్రతి విషయాన్ని సమాజంతో పంచుకోవాలన్న తృష్ణ ఉండాలి. అలా లేని పక్షంలో ఇంత సారస్వతాన్ని సృష్టించడం చాలా కష్టం. మల్లేల విజయలక్ష్మి వ్యక్తిత్వం నాకు చాలా విశిష్టంగా అనిపించింది. వారు ప్రతి విషయాన్ని ఎంతో విశ్లేషణాత్మకంగా రాయగలిగారు. ఈ పుస్తకం చదివిన తర్వాత వారి సహృదయత, సంస్కా రాలు నాకు ఎంతగానో బోధపడ్డా యి. చాలా మందికి చాలా చెప్పాలని ఉంటుంది. కానీ ఆ చెప్పే విధానం తెలియదు. ఈ విషయంలో విజయ లక్ష్మి అద్భుతమైన ప్రతిభను కనబరి చారు. ముఖ్యంగా యాత్రా విశేషాలను రాయడం అంత సులువైన విషయం కాదు. ఎందుకంటే మన రాష్ట్రంలో మన దేశంలో యాత్రా విశేషాలను రాయడం అంత సులువైన విషయం కాదు. ఎందుకంటే మన రాష్ట్రంలో మన దేశంలో యాత్రా విశేషాలను రాయడం పెద్ద ఇబ్బంది ఏమీ ఉండదు. ఎందుకంటే మనం పుట్టిన ప్పటి నుంచి మన దేశంలోని భౌగోళిక, చారిత్రక విషయాలను అవగా హన చేసుకుని ఉంటాం. విదేశీ పర్య టనల్లో వివిధ నగరాల్లో పర్యటిస్తు న్నప్పుడు అక్కడి ప్రాంతాల పేర్లు, నైసర్గిక విశేషాలు, సంస్కృతీ సంప్ర దాయాలు చాలా తెలియాల్సి ఉంటుంది.. వాటిని గుర్తు పెట్టుకో వాల్సి ఉంటుంది. కొన్ని విషయాలను మనం ఎప్పటికప్పుడు నోట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇందు లో విజయలక్ష్మి తన విదేశీ పర్యటనల విశేషాలను పాఠకు లతో అద్భుతంగా పంచుకు న్నారు.

ఈ కవయిత్రిలో నాకు నచ్చిన విషయాలు కవి తాత్మకత, అనుభూతు లను అక్షరీకరించే నేర్పు, ఇంకా విదేశాల్లో పర్యటిస్తున్నప్పుడు అక్కడి సుందరమైన ప్రదేశాల్లో ఫోటోలు తీసుకొని, వాటిని మనకు అందుబాటు





ప్రతులకు:
మల్లేల విజయలక్ష్మి
208, పి.యన్.ఆభరణ అపార్ట్‌మెంట్స్, రోడ్ నెం.1
డాక్టర్స్ కాలనీ, నల్లగడ్డ రోడ్
శేరిలింగంపల్లి,
సికింద్రాబాద్-500 019.
సెల్: 8978560460

లోకి తేవడం.

ఇక ఇందులో రచయిత్రి రాసిన లేఖలు శిల్పశోభితంగా ఉన్నాయి. భారతదేశంలోని ఆధ్యాత్మిక క్షేత్రాల పర్యటనలు కూడా ఎంతో హృద్యంగా రాశారు.

ఈ సంకలనంలో మరొక విశిష్టమైన విషయం ఉంది. ఇతరుల లేఖా సాహిత్యానికి కూడా ఇందులో స్థానం కల్పించడం. అందులో కూడా కొన్ని లేఖలు మనల్ని చాలా అలరిస్తాయి.

ఈ సంకలనంలోనే 'కవితల కబుర్లు' శీర్షికన 61 కవితలను పొందుపరిచారు. ముందే చెప్పుకు న్నట్టు ఈ కవయిత్రి చాలా సున్నిత మైన హృదయం గలవారు. అందుకే అనేక అనుభూతులకు విలువ నిచ్చి అద్భుతమైన కవితలను రూపొం దించారు.

హేమంతపు ఈ ఉదయం పేరుతో రాసిన కవితలో..

**"నిశికన్య నిశితంగా**
**వెనుదిరిగే వేళ**
**హేమంతుడు విసిరిన**
**మంచు పరదాలలో**
**నా మనస్సు చిక్కుబడిపోయింది"**

అంటారు. ఇలా రాయడం ప్రకృతితో తనకున్నటువంటి అనుబంధాన్ని తెలియజేసింది. ఇందులో మన **'అయోధ్య రామయ్య'** శీర్షిక రాసిన కవిత చదివిన తర్వాత విజయలక్ష్మి చక్కటి గేయాలను కూడా రూపొందించగలరని అర్థం అయింది.

'ఆకుపచ్చని ద్వీపంలో'.. కవితలో
**'నింగిలోని తళుకు**
**కంటిలోన మెరుపు**
**వాన చినుకు తోడ**
**పులకరించె తనువు'** అంటూ ప్రకృతి రమణీయతకు పులకించిపోతూ రాసిన కవిత మనకు ఎంతగానో ఆనం దాన్ని పంచుతుంది.

**'తరువు సేవ ఎన్ని తీరులో'** కవితలో చెట్టుపై ఎంతో ఉదాత్తమైన ప్రేమను వ్యక్తం చేశారు. అంతేకాదు చెట్టు యొక్క త్యాగాన్ని శిఖరాయమానంగా చెప్పగలిగారు.

**'పచ్చ పచ్చని తరువు**
**పుడమికే గొడుగాయె**
**పసిడి పువ్వుల వన్నెతో**
**పలకరించి నను పిలిచేను'** అనడం చాలా బాగుంది.

వైవిధ్యమైనటువంటి వస్తు సమాహారంతో రూపొందించిన కవితలు పాఠకులను ఆనందంలో ముంచెత్తుతాయి.

ఇందులో తాత్వికపరమైన కవితలు కూడా ఉన్నాయి. ప్రత్యేకంగా ఒకే వస్తువు మీద కాకుండా అనేక విషయాల సమాహారంగా ఈ పుస్తకం రావడం అభినందించదగ్గ విషయం. వైవిధ్యభరితమైన పాఠకులను అలరించే విధంగా ఇంతటి ఉద్గ్రంథాన్ని రూపొందించడం కూడా చాలా బాగుంది.

విజయలక్ష్మి చేసిన ఈ ప్రయత్నం అందరికీ ఆదర్శప్రాయం. నేనైతే కొన్ని లేఖలను మళ్లీ మళ్లీ చదివి ఆనందించాను. వీరి యాత్రా కథనాలు చదివిన తర్వాత నాకు అమెరికా గురించి ఎంతో అవగాహనతో కూడిన సమాచారం తెలిసింది.

ఈ పుస్తకం దాచుకోదగ్గ విధంగా రూపొందించినందుకు కవయిత్రిని, పుస్తక ప్రకాశకులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

ఉత్తరాల ఊసులు, కవితల కబుర్లు పేరుతో వస్తున్న ఇంత మంచి పుస్తకానికి చిరు అభిప్రాయాన్ని రాసే అవకాశాన్ని కల్పించిన రచయిత్రికి, ఆత్మీయ సోదరుడు డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్‌గారికి హృదయ పూర్వక ధన్యవాదాలు. జైహింద్!

*(మల్లెల విజయలక్ష్మి రచించిన 'ఉత్తరాల ఊసులు- కవితల కబుర్లు' పుస్తకానికి మౌనశ్రీ మల్లిక్ రాసిన ముందుమాట..)*



-మౌనశ్రీ మల్లిక్
8919338546

**ఒక మనిషి సుదీర్ఘమైన జీవి తంలో ఎన్నో ఆనందాల సందర్భాలు ఉండటం సహజం. వాటి తాలూకు అనుభూతులు జీవిత పర్యంతం గుర్తు కు రావడం సహజమైన విషయం. అయితే కొందరు వారి జీవితంలో జరిగిన అనేక సందర్భాలను అక్షరీక రించడం చేస్తారు.**

# భయమెందుకు ప్రశ్నించు?

నిశ్శబ్దం ప్రాణం తీస్తుంది
శబ్దం ప్రాణం పోస్తుంది
ఎందుకు పాపాలను
గుండెలో బరువుగా మోస్తావ్-
మంచి,మమకారం పెంచుతుంది
స్నేహం
ఆత్మీయత పంచుతుంది
ఎందుకు మంచిని
మనసులో దాచుకుంటావ్-
వెలుగు చీకటిని
దూరం చేస్తుంది-
మంచి చెడును
అంతం చేస్తుంది
ఎందుకు స్వార్థాన్ని
మనసులో పెంచుకుంటావ్-
ప్రశ్న ప్రపంచానికి అమృతం
ప్రశ్న జీవితానికి ఆయువు-
ప్రశ్న స్వేచ్ఛకు ఆయువుపట్టు
ప్రశ్న లేనిది జీవితం లేదు
ప్రశ్న లేనిది ఏ ఉదయం రాదు
ఎందుకు ప్రశ్నంటే
భయపడతావ్ ప్రశ్నించు-
ప్రశ్నించు ప్రశ్నించు
చైతన్యం రగిలించు
కదన రంగాన కదిలించు.
ప్రశ్నంటే వెలుగు రేఖ
ప్రశ్నంటే తూరుపు బాసట
ప్రశ్నంటే చీకటిని చీల్చే
ధైర్య గీతం
ప్రశ్నించు-
ప్రశ్నంటే పోరాట ఊపిరి
ప్రశ్నంటే
తల్లడిల్లిన నేల తల్లి
కలలుగన్న స్వప్నం-
ఆత్మ విలువ ఎగరేసిన
ఉద్యమ బావుట-
ప్రశ్నంటే కన్నీరై సాగే
కవి కలం
ఎందుకు ప్రశ్నంటే
భయ పడతావ్
ప్రశ్నించు-
భయమెందుకు ?
ప్రశ్న ప్రజాస్వామ్య
పూల జల్లు కల
ఆకాశం గొంతు
మెరుపు ఊపిరి
ప్రశ్నించు-
ప్రశ్నలే కవిత్వమైన రోజు
పిడికిలి ఆకాశ మవుతుంది
ప్రశ్న ప్రపంచాన్ని బతికిస్తుంది
ప్రశ్నించు-
ప్రశ్నించు ప్రశ్నించు
చైతన్యం రగిలించు
పూల జల్లులో విహరించు-
జనం ఓడిపోతున్నారు
పాలకులు గెలుస్తున్నారు

ఓటు రహస్యమా .....
ప్రశ్నించు-
శ్రమ చెమట ఓడిపోతున్నాయి
చీకటి కమ్ముకున్న మేఘం
మత్తును కురుస్తున్నది
ప్రశ్నించు-
నిజాయితీ రూటు మార్చింది
సేవ అర్థాన్ని కోల్పోతున్నది
ప్రశ్నించు-
సమైక్యతతో విద్వేష ఆట
పూల తోటలో ముళ్ల జాతర
మాయమాటల మత్తు
ఎన్నాళ్ళని
ప్రశ్నించు -
ప్రశ్నించు ప్రశ్నించు
చైతన్యం రగిలించు
కదన రంగాన కదిలించు-
కట్టు కథలకు బానిస మనం
విద్వేషాలకు బానిస మనం
జీవనం మనది కాదు
బతుకు అమావాస్య
విషాదమెందుకో
ప్రశ్నించు -
ప్రశ్నించు ప్రశ్నించు
చైతన్యం రగిలించు
కదన రంగాన కదిలించు-
మనసు దారి తప్పుతుందా
పోరుగీత మవుతుందా
ఆకాశం చెల్లాచెదురు
సమిష్టి తత్వం కోల్పోయిన
నక్షత్రాల గుంపు
ప్రశ్నించు-
మేఘాలలో మెరుపు లేదు
ఉరుము లేదు
పిడుగులు లేవు
అంతా చీకటి-
చల్లగాలి ఎందుకు
మాట్లాడడం మానేసిందో
నేల తల్లి ఎందుకు
కన్నీటిని తుడవడం లేదో
దుఃఖం సాగరం ఎందు కయ్యిందో
ప్రశ్నించు-
ప్రశ్నించు ప్రశ్నించు
చైతన్యం రగిలించు
కదన రంగాన కదిలించు
ప్రశ్న మరిచిపోయి
ఆకాశం స్వేచ్ఛ కోల్పోయింది.
ప్రశ్నించలేకనే నేలతల్లి
తడి ఆరిపోతున్నది
ప్రశ్నించలేకనే చినుకు
భయం కురుస్తున్నది
ప్రశ్నించు-

ప్రశ్నించలేకనే గాలి
స్వచ్ఛత కోల్పోయి
కల్తీమయ మయ్యింది
ప్రశ్నించు-
ప్రశ్నించలేకనే
మన భారతం
దోపిడి పాలవుతున్నది
ప్రశ్నించు -
ప్రశ్నించు ప్రశ్నించు
చైతన్యం రగిలించు
కదన రంగాన కదిలించు-
మతం రాజకీయమెందుకయ్యిందో
ప్రశ్నించు
రాజకీయ విరమణ
ఎందుకు లేదో ప్రశ్నించు
ఉచితాల ఆటల్లో హామీల వానల్లో
ఎన్నాళ్లు తడవాలో-
ప్రశ్నించు ప్రశ్నించు
చైతన్యం రగిలించు
కదన రంగాన కదిలించు.
మతాల ఆటలో
ఓట్ల వేటలో
నలిగేటి
మనసును
ప్రశ్నించు-
ప్రశ్నించు ప్రశ్నించు
చైతన్యం రగిలించు
కదన రంగాన కదిలించు-
దోపిడీని ప్రశ్నించు
మాయ మాటల మతలబును
అధర్మాన్ని అవినీతిని
దొంగల రాజ్యాన్ని
ప్రశ్నించు-
విభజించే కుట్రలను
ముందరి చీకట్లను
అందరి ఇక్కట్లను
ప్రశ్నించు-
చీకటిలో బతుకయ్యాక
భయమెందుకు ప్రశ్నించు-
భయం గుండెల మీద
నిలబడిన వాడివి
భయమెందుకు ప్రశ్నించు-
నీకోసం నాకోసం
మనకోసం ప్రశ్నించు-
ప్రశ్నించు ప్రశ్నించు
చైతన్యం రగిలించు
కదన రంగాన
కదిలించు.



-సిరిసిల్లా గఫూర్ శిక్షక్
9849062038

